సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 08.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 002
పేజీలు: 10 వెల: రూ. 5



పాఠకులకు, ప్రకటన కర్తలకు, ఏజెంట్లకు

దీపావళి శుభాకాంక్షలు

నేడు దీపావళి సందర్భంగా

కార్యాలయానికి సెలవు

పునర్దర్శనం మంగళవారం

టెండర్లలో దోపిడీ

పాంగులేటి కంపెనీకి లబ్ధి

- మంత్రి పొంగులేటి కంపెనీకి ప్రయోజనం చేకూర్చేలా ప్రక్రియ
- రూ.1,450 కోట్ల నుంచి రూ.6,825 కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం
- రైతులకు చుక్క నీరు అందకముందే ఐదు రెట్లు పెరిగిన అంచనాలు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు


2

కాంగ్రెస్‌కు అగ్ని పరీక్ష

పట్టభద్రుల తీర్పుతో రేవంత్ భవితవ్యం తేలనుందా?

కాంగ్రెస్ పాలనకు విద్యావంతుల ఓటు పరీక్ష!

- గెలిస్తే జోష్.. ఓడితే విపక్షాలకు పండగే!
- నిరుద్యోగుల అసంతృప్తి కాంగ్రెస్ కొంప ముంచుతుందా?
- పట్టభద్రుల ఓటుతో మారనున్న తెలంగాణ రాజకీయ సమీకరణాలు!
- రేవంత్ పాలనపై గ్రాడ్యుయేట్ల తీర్పు ఎలా ఉండబోతోంది?
- కాంగ్రెస్ విజయంపై విపక్షాల గురి..!
- ఎమ్మెల్సీ ఎన్నికలతో అధికార పార్టీకి కొత్త సవాల్!



ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్టాత్మకంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండున్నరేళ్ల పాలనలో తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన హామీలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, విద్యావంతుల పట్ల అనుసరించిన వైఖరికి ఈ ఎన్నికలు ఒక పరీక్షగా నిలవనున్నాయి. సాధారణ ఎన్నికలతో పోలిస్తే భిన్నమైన ఓటింగ్ సరళి ఉండే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటర్లు ఇచ్చే తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న ప్రజాభిప్రాయానికి అద్దం పట్టనుంది. అందుకే ఈ ఎమ్మెల్సీ పోరును రాజకీయ వర్గాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక అప్రకటిత రిఫరెండంగా అభివర్ణిస్తున్నాయి.

విద్యావంతుల తీర్పుపై ఆసక్తి
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిరుద్యోగ యువత, ప్రభుత్వ ఉద్యోగులు, మిగతా 02లో

పంచాయతీలకు గుడ్‌న్యూస్

నిధులపై తెలంగాణ ప్రభుత్వం కొత్త రూల్

- పంచాయతీలకు సొంత ఆదాయంపై అధికారం
- నేరుగా బ్యాంకు ఖాతాల్లోకి నిధులు
- ప్రభుత్వ ఖజానా ద్వారా మళ్లింపునకు చెక్
- గ్రామాల్లో అభివృద్ధి పనులకు వేగం



ముద్ర, తెలంగాణ బ్యూరో :
గ్రామ స్థాయి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలు తమ సొంత వనరుల ద్వారా సమకూర్చుకున్న ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ఖజానా ద్వారా మళ్లించాల్సిన అవసరం లేకుండా, నేరుగా ఆయా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేందుకు వీలుగా చట్ట సవరణ చేసింది. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, తెలంగాణ పంచాయతీ రాజ్ (నాల్గవ సవరణ) చట్టం, 2026ను అక్టోబర్ 9, 2026 నుండి అమల్లోకి తెస్తూ జీవో ఎంఎస్ నెం. 43ను జారీ చేసింది. ప్రభుత్వ తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగవంతం కానున్నాయి. మిగతా 02లో

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే

సీఎం రేవంత్ రెడ్డి

- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటన
- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ
- గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరు



2

17 ఏళ్ల నిరీక్షణకు తెర

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

- కూకట్‌పల్లి ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
- 101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశం
- కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట
- 14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
- కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఆంక్షలు

-ముద్ర, కూకట్‌పల్లి:



5

నామినేటెడ్ పోస్టుల భర్తీ!



- చైర్మన్, డైరెక్టర్ పదవుల భర్తీకి రంగం సిద్ధం!
- ఆశావహుల్లో పెరిగిన ఆశలు..
- నామినేటెడ్ పోస్టులపై మహేష్ గౌడ్ కీలక ప్రకటన
- అధిష్టానానికి చేరిన నేతల పనితీరు నివేదిక!

2

కూటమి దూకుడు

ఏపీ పరిషత్ ఎన్నికల ఫలితాల్లో ప్రభంజనం



- ఏపీలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ప్రారంభం నుంచి కూటమి అభ్యర్థుల ఆధిక్యం
- ఏకపక్షంగా మారుతున్న ఫలితాలు

2

elegans GROUP

OUR SIGNATURE PROJECTS

SPACES THAT INSPIRE A BETTER TOMORROW



EMPERIA I
Commercial Spaces
Premium IT Business Tower at Financial District, Hyderabad
RERA REG. NO. P02400000973



EMPERIA II
Commercial Spaces
15 Floors of Commercial Spaces at Financial District, Hyderabad with An IGBC Platinam Rating.
RERA REG. NO. P02400004050



EMPERIA HOMES
Villas
3 BHK + Home Theatre Villas at Kollur, Hyderabad.
RERA REG. NO. P01100002447

VANAE
Luxury apartments
Kollur Exit - 2, Hyderabad, Telangana - 502300
RERA REG. NO. P01100011341



STHIRA FARMS
Farms
Near Moinabad, Hyderabad



SUVASA
Villas
Thoughtfully Crafted 4BHK Villas + Home Theatre at Velimela, Kollur, Hyderabad.
RERA REG. NO. P01100010778



SREYAN
Villas
4BHK Villas at Kompally, Adjacent to NH-44, Hyderabad
RERA REG. NO. P02200007108

+91 91333 45200 | WWW.ELEGANSGROUP.IN

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
ఆదివారం, 08 నవంబర్, 2026

ఇన్‌హేలర్ ఎప్పుడూ దగ్గర ఉంచుకోండి

అస్తమా వ్యాధిగ్రస్తులు దీపావళి వేడుకలకు వెళ్లినా వైద్యులు సూచించిన ఇన్‌హేలర్‌ను వెంట తీసుకెళ్లాలి. అత్యవసర సమయంలో ఎలా ఉపయోగించాలో ముందుగానే తెలుసుకోవాలి.



టెండర్లలో దోపిడీ

ముద్ర, హైదరాబాద్ :
తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు.
ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి' అని అన్నారు.
ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.



కాంగ్రెస్‌కు లిట్మస్ టెస్ట్

(మొదటి పేజీ తరువాయి)
ఉపాధ్యాయులు, న్యాయవాదులు, ఐటీ నిపుణులు, మేధావులు సహా వివిధ రంగాలకు చెందిన విద్యావంతులు ఓటర్లుగా ఉంటారు. వీరు సాధారణంగా రాజకీయ అంశాలతో పాటు ప్రభుత్వ విధానాలు, హామీల అమలు, ఉద్యోగ అవకాశాలు, పాలనా పారదర్శకత వంటి అంశాలను బేరీజు వేసుకుని ఓటు వేస్తారు. ముఖ్యంగా ఉద్యోగ నోటిఫికేషన్లు, ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు, పెండింగ్ బకాయిలు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రభుత్వంపై తమకున్న అభిప్రాయాన్ని బ్యాలెట్ ద్వారా వ్యక్తం చేసేందుకు పట్టభద్రులు సిద్ధమవుతున్నారు.

గెలిస్తే కాంగ్రెస్‌కు రాజకీయ బలం
ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తే అధికార పార్టీకి అది పెద్ద ఊరటనివ్వనుంది. ముఖ్యంగా విద్యావంతులు, యువతలో ప్రభుత్వంపై సానుకూలత కొనసాగుతోందనే సంకేతంగా కాంగ్రెస్ నాయకత్వం ఈ ఫలితాలను ప్రచారం చేసుకునే అవకాశం ఉంటుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు భవిష్యత్తు రాజకీయ పోరాటాలకు ఈ విజయం పార్టీకి అదనపు బలాన్ని అందించవచ్చు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు కూడా ఈ ఫలితాలతో కాంగ్రెస్ సమాధానం చెప్పగలదు.

ఓటమి ఎదురైతే విపక్షాలకు అస్త్రం!
అయితే ఫలితాలు ప్రతికూలంగా వస్తే మాత్రం పరిస్థితి పూర్తిగా మారే అవకాశం ఉంది. ఒక్క స్థానంలో ఓటమి ఎదురైనా, ముఖ్యంగా స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలైనా బీఆర్ఎస్, బీజేపీలకు అధికార పార్టీని ఇరుకున పెట్టేందుకు బలమైన అస్త్రం లభిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, రెండున్నరేళ్ల పాలనపై విద్యావంతులు అసంతృప్తితో ఉన్నారని విపక్షాలు ప్రచారం చేసే అవకాశం ఉంది. ఇప్పటికే నిరుద్యోగుల ఆందోళనలు, ఉద్యోగాల భర్తీలో జాప్యం, రైతు భరోసా, పెన్షన్ల పంపిణీ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో పట్టభద్రుల తీర్పు ప్రతికూలంగా వస్తే ఆ విమర్శలకు మరింత బలం చేకూరినట్లవుతుంది.

అభ్యర్థుల ఎంపికతోనే సరిపోదు!
ఈ రాజకీయ పరిణామాలను ముందుగానే అంచనా వేస్తున్న కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించడంతో పాటు ఓటర్ల నమోదు, క్షేత్ర స్థాయి ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కేవలం ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహిస్తే సరిపోదు. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించాల్సి ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ వంటి కీలక నియోజకవర్గాలతో పాటు ఇతర పట్టభద్రుల స్థానాల్లో కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

రేవంత్ సర్కార్‌కు అసలు పరీక్ష!
మొత్తంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్‌కు కేవలం శాసనమండలిలో కొన్ని స్థానాలను గెలుచుకునే పోరు మాత్రమే కాదు. ప్రభుత్వ పనితీరు, హామీల అమలు, యువతతో పాటు విద్యావంతుల్లో ఉన్న రాజకీయ అభిప్రాయాన్ని అంచనా వేసే కీలక సందర్భం. విజయం సాధిస్తే రేవంత్ సర్కార్‌కు రాజకీయంగా కొత్త ఉత్సాహం వస్తుంది. ఫలితాలు ప్రతికూలంగా వస్తే మాత్రం విపక్షాల విమర్శలకు మరింత పదును పెరుగుతుంది. మరి పట్టభద్రులు కాంగ్రెస్ పాలనకు అనుకూలంగా తీర్పునిస్తారా? లేక అసంతృప్తిని బ్యాలెట్ రూపంలో బయటపెడతారా? అన్నది ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

కూటమి దూకుడు

ముద్ర, అమరావతి:
ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల ఫలితాల సరళిని గమనిస్తే.. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. అధికార కూటమికి వైసీపీ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది. కౌంటింగ్ మొదలైనప్పటి నుంచి దాదాపు అన్ని జిల్లాల్లోనూ కూటమి అభ్యర్థులే ఆధిక్యం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల ప్రకారం అత్యధిక ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కూటమి పార్టీలే కైవసం చేసుకున్నాయి.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఫలితాల లేటెస్ట్ ట్రెండ్స్
జడ్పీటీసీ (212 / 659)
కూటమి – గెలుపు (84), ఆధిక్యం (118)
వైసీపీ – గెలుపు (1), ఆధిక్యం (9)
ఇతరులు – గెలుపు (0), ఆధిక్యం (0).

ఎంపీటీసీ (2224 / 9821)
కూటమి – గెలుపు (2073)
వైసీపీ – గెలుపు (111)
ఇతరులు – గెలుపు (40).

ప్రాజెక్టుల్లో నీళ్లన్నీ తాగేందుకే

ముద్ర, మహబూబ్ నగర్ :
ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశముందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రాజెక్టుల్లో ప్రస్తుతం ఉన్న నీళ్లు తాగునీటి అవసరాలకే సరిపోతాయని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచించారు. ఎల్‌నినోపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. కష్టకాలంలో ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందరం కలిసికట్టుగా పరిస్థితులను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.
సంక్రాంతి తర్వాత రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని సీఎం ప్రకటించారు. మూడు రోజుల కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా శనివారం హకీంపేట, దుద్యాల మండలాల్లో రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో బీఆర్ఎస్ నేతలపై విమర్శలు గుప్పించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటే తెలంగాణలోనే కరవు వచ్చినట్లు బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని రేవంత్ విమర్శించారు. బావబామ్మర్దులు ఊళ్లపై పడి అబద్ధాలు చెబుతారని, వారి మాటలు విని రైతులు నష్టపోవద్దని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటల జోలికి వెళ్లకుండా ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు.
మేడిగడ్డ నుంచి నీళ్లు ఎత్తిపోసుకోకపోవడం వల్లే ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు వెళ్తున్నాయన్న బీఆర్ఎస్ ఆరోపణల్లో నిజం లేదని సీఎం అన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో 16 టీఎంసీల నీరు ఉంటేనే కన్నెపల్లి నుంచి ఎత్తిపోసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లు దించే పరిస్థితి కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అవినీతి వల్లే ఈ మూడు బ్యారేజీలు పనిచేయడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన దేవాదుల, వైఎస్సార్ ప్రారంభించిన ప్రాజెక్టులే ప్రస్తుతం రైతులకు, ఖమ్మం జిల్లాకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.
పాలమూరు నుంచి గెలిచిన కేసీఆర్ భారీ బడ్జెట్ ఖర్చు చేసినా అక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయలేదని రేవంత్ విమర్శించారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి పేరు, స్థలం, అంచనాలు మార్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పాలనలోనే కూలిపోయిందని ఆరోపించారు. వచ్చే డిసెంబరులో ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు స్పీకర్ అనుమతి కోరుతున్నామని, ఆ సమావేశాల్లో ఎల్‌నినో, కాళేశ్వరం అంశాలపై చర్చించేందుకు సిద్ధమని సవాల్ విసిరారు.
కొడంగల్–నారాయణపేట–మక్తల్ ఎత్తిపోతల పథకం అంచనాలు పెంచడంపై కేటీఆర్ చేస్తున్న విమర్శలకూ సీఎం సమాధానమిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొడంగల్ ప్రాంతానికి ఏం చేశారని ప్రశ్నించారు. గతంలో ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.2 లక్షలు ఇచ్చేందుకు కూడా కేసీఆర్ ప్రభుత్వం ముందుకు రాలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ. 20 లక్షల వరకు పరిహారం ఇస్తోందన్నారు. హైదరాబాద్–లగచర్ల ప్రాంతాన్ని ఢిల్లీ–నాయితీ ఏర్పడింది. సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించడంతో పాటు ఓటర్ల నమోదు, క్షేత్ర స్థాయి ప్రచారంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది. కేవలం ఎన్నికల సమయంలో ప్రచారం నిర్వహిస్తే సరిపోదు. నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగుల్లో ఉన్న అసంతృప్తిని గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నించాల్సి ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ వంటి కీలక నియోజకవర్గాలతో పాటు ఇతర పట్టభద్రుల స్థానాల్లో కాంగ్రెస్ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



యిడా తరహాలో అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. హకీంపేటలో 250 ఎకరాల్లో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కేటీఆర్ వేషభాషలు మార్చుకున్నా ప్రజలు నమ్మరని రేవంత్ ఎద్దేవా చేశారు. గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరని వ్యాఖ్యానించారు. తాను మూడేళ్లుగా గంట కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని చెప్పారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని, అబద్ధాలు ప్రచారం చేస్తున్న కుటుంబాన్ని ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు.

ఈ20 కాదు..420

పెట్రోల్‌లో 31 శాతం ఇథనాల్

ముద్ర, న్యూఢిల్లీ :
కర్ణాటకలోని పలు పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్‌లో 20శాతం కంటే ఎక్కువగా ఇథనాల్ ఉన్నట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఈ20 (E20) కార్యక్రమం కాస్తా 420గా మారిందంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగలించడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ చమురు కంపెనీలు.. నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు కర్ణాటక (Karnataka)లోని పలు జిల్లాల నుంచి సేకరించిన ఇంధన నమూనాల ప్రయోగశాల పరీక్షలను ఆయన ఉటంకించారు.



బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణం, రామనగర, మంగళూరు, తుమకూరుతో సహా పలు ప్రాంతాల నుంచి ఈ నమూనాలను సేకరించినట్లు రాహుల్ వెల్లడించారు. వీటిల్లో ఇథనాల్ గాఢతలు 31.2శాతం– 30.5శాతంగా నమోదయ్యాయని తెలిపారు. గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించిన మొత్తం 14నమూనాలలోని 11నమూనాల్లో 20శాతానికి పైగా ఇథనాల్ ఉన్నట్లు తేలిందని చెప్పారు. ఇంధన ట్యాంకులలో ఏమి నింపుతున్నారనే విషయాన్ని ఇప్పటికైనా తెలియజేయాలని ప్రధాని మోదీని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.
20శాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఇటువంటి విధానాల వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత నిలదీశారు.
కర్ణాటకలో ఈ–20 పేరిట 30శాతం ఇథనాల్ కలిసిన ఇంధనాన్ని విక్రయిస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ శుక్రవారం ఆరోపించారు. దీంతో ఈ విషయంపై రాజకీయ దుమారం రేగింది. అయితే పెట్రోల్‌లో ఇథనాల్ పరిమాణం ఎక్కువగా ఉందని కర్ణాటక ప్రభుత్వం వాదించడాన్ని కేంద్ర పెట్రోలియం సంస్థలు– ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా తోసిపుచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పరీక్ష ప్రామాణికత సరికాదని తేల్చిచెప్పాయి. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సంస్థ నిబంధనల మేరకు ఇథనాల్ 19– 21శాతం మధ్య ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించాయి.

పంచాయతీలకు గుడ్‌న్యూస్



(మొదటి పేజీ తీరువాయి)
జాప్యానికి చెక్
గతంలో గ్రామ పంచాయతీలు వివిధ మార్గాల ద్వారా సమకూర్చుకున్న సొంత ఆదాయాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేసి, ఆ తర్వాత నిధులను పొందాల్సి వచ్చేది. ఈ సంక్లిష్టమైన విధానం వల్ల గ్రామాల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కావడంలో తీవ్ర జాప్యం జరిగేది. ఫలితంగా పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారుల మరమ్మతులు వంటి ప్రాథమిక అవసరాలను తీర్చడంలో గ్రామ పంచాయతీలు తరచూ ఇబ్బందులను ఎదుర్కొనేవి. స్థానిక సంస్థల ఆర్థిక స్వయంప్రతిపత్తికి ఈ విధానం కొంత అడ్డంకిగా మారడంతో, ప్రభుత్వం శాసన సవరణను తీసుకువచ్చింది.

వేగవంతం కానున్న స్థానిక అభివృద్ధి పనులు
ఇప్పుడు కొత్త నిబంధనల ప్రకారం నిధులు నేరుగా గ్రామ పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ అవుతుండటంతో, సర్పంచ్‌లు లేదా పాలకవర్గాలు ఆ ఆదాయాన్ని ఎవరి అనుమతి కోసం ఎదురుచూడకుండా తక్షణమే వినియోగించుకునే అవకాశం ఏర్పడింది. ప్రజల తక్షణ స్థానిక అవసరాలను ఇట్టే తీర్చడానికి ఈ సంస్కరణ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు తెలిపారు. నిధుల కొరత లేదా సాంకేతిక జాప్యం లేకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి ప్రాజెక్టులు శరవేగంగా ముందుకు సాగనున్నాయి. ఈ నిర్ణయంతో గ్రామ పంచాయతీలు ఆర్థికంగా మరింత పటిష్టంగా మారడంతో పాటు, పాలనలో పారదర్శకత పెరుగుతుందని భావిస్తున్నారు.



నామినేటెడ్
పోస్టుల భర్తీ!

ముద్ర, హైదరాబాద్:
రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగంగా జరుగుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను కూడా త్వరలోనే భర్తీ చేయనున్నట్లు తెలిపారు. చైర్మన్ పదవులతో పాటు డైరెక్టర్ పదవుల భర్తీకి సంబంధించి ప్రస్తుతం తీవ్ర కసరత్తు జరుగుతోందని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీలో ప్రస్తుత పరిస్థితులు, పరిణామాలపై పూర్తి వివరాలను సేకరించి అధిష్టానానికి నివేదిక అందజేసినట్లు తెలిపారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీలు..
ప్రస్తుతం గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఏఐసీసీ నిఘా – పనితీరు ఆధారంగానే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం గతంలో ఉన్నట్లు లేదని, నాయకులు, మంత్రుల పనితీరును పర్యవేక్షించడానికి ఏఐసీసీ స్థాయిలో పెద్ద వ్యవస్థే పని చేస్తోందని తెలిపారు. కనీసం 3 రోజులు పార్టీ కార్యక్రమాల నివేదిక ఢిల్లీకి వెళ్లకుంటే వెంటనే అక్కడి నుంచి మెసేజ్ వస్తుందని ఆయన పేర్కొన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు ఇతర నాయకులందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తున్నారని మహేష్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

సీఎం చేతుల మీదుగా 19న చీరల పంపిణీ


ముద్ర, హైదరాబాద్:
రాష్ట్రంలో ఇందిరా మహిళాశక్తి పథకం కింద మహిళలకు ఉచిత చీరల పంపిణీ కార్యక్రమం ఈ నెల 19న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. దీనికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాజధాని శివార్లలోని మహిళాసంఘాల సభ్యురాళ్లు హాజరుకానున్నారు. 2026 సంవత్సరానికిగాను రాష్ట్రంలో ఉచిత చీరల పంపిణీ పథకానికి ప్రభుత్వం రూ. 334 కోట్లను కేటాయించింది. గతంలో పాలపిట్ట రంగు చీరలు ఉండగా.. ఈ సారి ఎరుపు జరీ అంచు గల చిలకపచ్చ రంగును ఎంపిక చేశారు. ఏప్రిల్ నుంచే సిరిసిల్లతో పాటు మరో 13 కేంద్రాల్లో చీరల ఉత్పత్తిని ప్రారంభించారు. మొత్తం 95 లక్షల మందికి పంపిణీ చేయడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 65 లక్షల చీరల తయారీ పూర్తయింది. వీటిని ఇప్పటికే జిల్లాలకు చేర్చారు. దాదాపు రెండు నెలల క్రితమే సగానికి పైగా చీరలు సిద్ధమయినా.. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని చీరల పంపిణీ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం జరిగిన మంత్రిమండలి ఆమోదం తెలిపింది.
ప్రత్యేక యాప్ సిద్ధం
చీరలను తెల్ల రేషన్‌కార్డు గల కుటుంబాల మహిళలకు వారం రోజుల పాటు పంపిణీ చేయనున్నారు. చీరల పంపిణీకి ప్రత్యేకయాప్‌ను సిద్ధం చేశారు. పంపిణీ కేంద్రాలు లేదా ఇళ్ల వద్ద మహిళలు తమ ఆధార్ కార్డులను పంచాయతీ అధికారులకు చూపాలి. యాప్ ద్వారా ఫొటో తీసుకుని, వివరాలు ధ్రువీకరణ అయిన తర్వాత చీరలు పంపిణీ చేస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది, సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పంపిణీ బాధ్యతలను అప్పగించింది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 8.11.2026
www.mudranews.in | @mudranews

టపాసుల పొగ : చిన్న దగ్గును నిర్లక్ష్యం చేయకండి

టపాసుల పొగ తగిలిన తర్వాత దగ్గు, పిల్లికూతలు, ఛాతీలో బిగుతు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పొగ ఉన్న ప్రాంతం నుంచి దూరంగా వెళ్లాలి.



HONOUR

Honour wishes
you and your family members a very

Happy
Diwali

Celebrating the spirit of innovation, partnership and substainable growth that lights the path to a healthier tomorrow.

2 R&D Centers

8 cGMP manufacturing facilities

15+ years of experience

300+ scientists

3,500+ total workforce

5,000+ m³ total production capacity

INNOVATION
Advancing science with purpose

SUSTAINABILITY
Building responsibly for tomorrow

PARTNERSHIP
Growing together through trust

EXCELLENCE
Committed to quality and reliability

Follow us on: in

honourlab.com

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

ఆదివారం,
08 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..



వాట్సప్ నం.: 9849623744
మేయిల్: mudradaily@gmail.com

'నరక చతుర్దశి, దీపావళి'

నవంబరు 8వ తేదీ ఆదివారం నరక చతుర్దశి, దీపావళి ఈ రెండు పర్వదినాలు కలిసి వచ్చాయి. మరి ఈ సందర్భంగా ఎలాంటి ముఖ్యమైన విధి విధానాలు పాటిస్తే ఏడాదంతా అదృష్టం, ఐశ్వర్యం కలిసొస్తాయో ప్రముఖ జ్యోతిష్యులు మాచిరాజు కిరణ్ కుమార్ ఇలా వివరిస్తున్నారు.



నవంబరు 8 ఉదయం చతుర్దశి తిథి కాబట్టి ఆరోజు నరక చతుర్దశి అయింది. రాత్రికి అమావాస్య ఉంది కనుక ఆరోజే దీపావళి కూడా అయింది. అలా ఒకేరోజు రెండు కలిసి వచ్చాయి. కాబట్టి ఈరోజు నరక చతుర్దశి, దీపావళి విధానాలన్నీ పాటిస్తే సంవత్సరం మొత్తం అద్భుతంగా ఐశ్వర్యం, అదృష్టం కలిసి వస్తుందంటున్నారు జ్యోతిష్యులు మాచిరాజు. నరక చతుర్దశి అన్నా, దీపావళి అన్నా ఈ రెండు రోజుల్లో కూడా ఒక ముఖ్యమైన విధి విధానం అందరూ తప్పకుండా పాటించాలంటున్నారు. అదేంటంటే, అభ్యంగన స్నానం. ఒంటికి, తలకి నువ్వుల నూనె రాసుకుని తలంటు స్నానం చేస్తే దాన్ని అభ్యంగన స్నానం అంటారు. నవంబరు 8న ఈ స్నానాన్ని ఆచరించాలంటున్నారు. ఏ సమయంలో చేయాలంటే, సూర్యోదయానికి పూర్వం చేస్తే చాలా మంచిదంటున్నారు. కుదరని వాళ్లు కనీసం ఉదయం ఎనిమిది గంటలలోపు అయినా చేసే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు.

ఎందుకు చేయాలి?

శాస్త్రంలో రెండు శ్లోకాలు చెప్పారు. అందులో మొదటి శ్లోకం వచ్చేసి 'ఆశ్వయుజ చతుర్థస్యాం సూర్యోదయాత్పూర్వ యామిని పశ్చిమ భాగే తైలాభ్యంగో విధీయతే'. దీనిలో ఉన్న అర్థం ఏమిటంటే, ఆశ్వీయుజ మాసం బహుళ పక్షం చతుర్దశి సూర్యోదయానికి పూర్వమే అంటే తెల్లవారు జామున నువ్వుల నూనె ఒంటికి, తలకి రాసుకొని అభ్యంగన స్నానం చేయాలి. ఎందుకు చేయాలి అంటే నరకాసురుని సంహరించిన తర్వాత శ్రీకృష్ణుడు కూడా ఆ నరక చతుర్దశి రోజు తెల్లవారుజామున ఇలా అభ్యంగన స్నానం చేశాడు. అందుకే మనమందరం కూడా ఇలా అభ్యంగన స్నానం చేయాలని చెబుతున్నారు. అలా చేస్తే మనకున్న నెగిటివ్ ఎనర్జీ తొలగిపోతుందంటున్నారు.

అదే రోజు దీపావళి అయింది. దివాళీకి మరో శ్లోకం చెప్పారు. 'తైలే లక్ష్మీర్ జలే గంగా దీపావళి తిథావసేత అలక్ష్మీ పరిహారార్థం తైలాభ్యంగో విధీయతే'. దీని అర్థమేమిటంటే, దీపావళి రోజు నువ్వుల నూనెలో లక్ష్మీదేవి ఉంటుంది. నీళ్లలో గంగాదేవి ఉంటుంది. దరిద్ర దేవతను పోగొట్టుకోవడానికి ఒంటికి తలకి నువ్వుల నూనె రాసుకుని తలంటు స్నానం చేయాలి. ఇలా చేయడం ద్వారా లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. గంగా స్నానం చేసిన ఫలితం వస్తుందని ఈ శ్లోకం చెబుతుంది. కాబట్టి, నవంబరు 8వ తేదీ సూర్యోదయానికి పూర్వమే ఇలా అభ్యంగన స్నానం చేయమని ఈ శ్లోకాలు చెబుతున్నాయి.

నరక చతుర్దశి స్నానంలో ఉత్తరేణి కొమ్మ ఉండేలా చూసుకుంటే మంచిది. మీకు అది దొరికినట్లయితే దాన్ని నీళ్లలో ముంచి, తల చుట్టూ తిప్పుకొంటూ స్నానం చేస్తే చాలా మంచిదని చెబుతున్నారు జ్యోతిష్యులు మాచిరాజు. ఇది లభించకపోయినా కూడా మామూలుగా అయినా సరే సూర్యోదయానికి పూర్వమే స్నానం చేయండని చెబుతున్నారు.

నరక చతుర్దశి విధుల్లో మినుములతో చేసిన పదార్థాలు తినమని లింగ పురాణంలో చెప్పారు. అప్పుడు దోషాలు అనేవి తొలగిపోతాయి. కాబట్టి, నవంబరు 8న అందరి ఆహారంలో మినుములతో చేసిన పదార్థాలు మధ్యాహ్నం పూట తినండి. మినపగారెలు, మినప సున్ని ఉండలు ఇలాంటివి తింటే చాలా మంచిది. అలాగే, నరక చతుర్దశి రోజు దక్షిణ దిక్కులో పెద్ద పెద్ద దివిటీలు పట్టుకొని ఉండమని శాస్త్రాల్లో చెప్పారు. దీనికి 'ఉల్కాదానం' అని పేరు.

ఆ దివిటీలు ఎందుకు పట్టుకోవాలంటే?

పితృ దేవతలు భూలోకానికి వస్తారు. వాళ్లు మళ్లీ పితృ లోకాలకు వెళ్లేటప్పుడు వెలుగు ద్వారా మనం దారి చూపించాలి. అందుకే దివిటీలు పట్టుకోమంటారు. పెద్ద పెద్ద కాగడాలు వెలిగించి దివిటీలాగా ఆ కాగడాలు పట్టుకోమని శాస్త్రాల్లో చెప్పారు. అయితే, మనమందరం అలా దివిటీలు వెలిగించడం, కాగడాలు పట్టుకోవడం ఇలాంటివి చేయలేం కాబట్టి పితృ దేవతలకు ఇష్టమైన దక్షిణ దిక్కులో దీపం పెట్టాలి. ఇది నరక చతుర్దశి విధివిధానం. కాబట్టి నవంబరు 8వ తేదీన అందరూ చీకటి పడ్డాక దక్షిణ దిక్కులో ప్రమిదలో నువ్వుల నూనె పోసి, ఒత్తులు కూడా దక్షిణం వైపు వెలిగేలా దీపం పెట్టండి. అది మాత్రం పితృదేవతలకు దారి చూపిస్తుంది. ఉల్కాదానం పేరుతో ఇలా దివిటీలు వెలిగించలేకపోయిన వాళ్లు దానికి ప్రత్యామ్నాయంగా ఈ దీపం పెట్టాలంటున్నారు జ్యోతిష్యులు మాచిరాజు కిరణ్ కుమార్.

నరకచతుర్దశి రోజు యమధర్మరాజుకు తర్పణం ఇవ్వాలి. అది ఎలా ఇవ్వాలో కూడా శాస్త్రాల్లో చెప్పారు. దక్షిణం వైపు తిరిగి నల్ల నువ్వులు కలిపిన నీళ్లను చూపుడు వేలు, మధ్యవేలు, ఉంగరం వేలు, చిటికిన వేలు ఈ నాలుగు వేళ్ల నుంచి విడిచిపెడుతూ యమాయ నమః యమం తర్పయామి యమాయ నమః యమం తర్పయామి యమాయ నమః యమం తర్పయామి అని అనుకోవాలి. ఇది ఇంటి యజమాని చేయాలి. ఇది చేస్తే ప్రయోజనమేంటంటే, ఇంట్లో సభ్యులందరికీ అపమృత్యు దోషాలుండవు. సంవత్సరం మొత్తం యమధర్మ రాజు అనుగ్రహం కలుగుతుంది. అంటే, నవంబరు 8న స్నానం చేశాక ఇంటి యజమాని దక్షిణం వైపు తిరిగి ఇలా నల్ల నువ్వులు కలిపి నీళ్లు విడిచిపెడుతూ ఈ మంత్రం మూడు సార్లు చదువుకోవాలి. ఇవి నరకచతుర్దశి రోజు పాటించాల్సిన విధివిధానాలు అని చెబుతున్నారు.

దీపావళి రోజు ఏం చేయాలంటే?

దీపావళి విధులు ఏంటంటే, దీపావళి అంటే దీపాల వరుస. ఈ రోజు దీపాలు ఎందుకు వెలిగించాలంటే దేవదానవులు క్షీరసాగర మధనం చేసినప్పుడు పాల సముద్రాన్ని చిలికినప్పుడు లక్ష్మీదేవి ఒక దీపం రూపంలో పుట్టిన రోజు దీపావళి. లక్ష్మీదేవి జ్యోతి రూపంలో పుట్టిన రోజు ఆశ్వీయుజ బహుళ అమావాస్య. ఆమె జ్యోతి రూపంలో దేవేంద్రుడికి సమస్త దేవతలకి దర్శనం ఇచ్చిన రోజు ఆశ్వీయుజ బహుళ అమావాస్య కాబట్టి లక్ష్మీదేవి దీపం లాగా జ్యోతిలాగా వచ్చింది కాబట్టి దీపాలు వెలిగిస్తే లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుంది. దీప లక్ష రూపంలో లక్ష్మీదేవిని పూజించాలి.

రాత్రిపూట దీపాలు ఎందుకు వెలిగించాలంటే?

కాళికా పురాణం ప్రకారం కాళికాదేవి రాక్షసులను సంహరించిన తర్వాత ఒక జ్యోతి రూపంలో దేవతలకు దర్శనమిచ్చింది. కాళిక అంటే రాత్రి. అందువల్ల రాత్రి పూట దీపాలు పెడితే లక్ష్మీదేవి అనుగ్రహం, కాళికా మాత అనుగ్రహం కలుగుతుంది. దారిద్ర్యాన్ని తరిమికొట్టడమే టపాకాయలు కాల్చడంలో ఉన్న అంతరార్థం. దీపావళి అనగానే అందరూ గోధుమల దీపం వెలిగించాలి. అదృష్టం, ఐశ్వర్యం కలిసి వస్తుంది. అయితే, ఎప్పుడు వెలిగించాలనే చాలామందికి ఉంటుంది. సాధ్యమైనంతవరకు బాగా చీకటి పడ్డాక ఇంటి ముందు భాగంలో గోధుమల దీపం పెట్టి తెల్లవార్లు ఆ దీపం వెలిగేలాగా చూడండి.

'గోధుమల దీపం' అంటే ఏమిటి?

ఇంటి ముందు భాగంలో గోధుమలు కుప్పలాగా పోయటం. దానిమీద ఒక పెద్ద మట్టిప్రమిదలో నువ్వుల నూనె పోసి వత్తులు వేసి దీపం వెలుగుతూ ఉండేలా చూడటం. దీన్నే 'గోధుమల దీపం' అంటారు. ఇలా గానిలేదా గోధుమపిండి, బెల్లం తురుము, ఆవుపాలు కలిపి ఒక పిండి ప్రమిదలో అయినా సరే నువ్వుల నూనె పోసి దీపం పెట్టవచ్చు. ఆ దీపం కొండెక్కాక అక్కడున్న గోధుమలు ఏం చేయాలంటే, నానబెట్టి గోమాతకు తినిపించవచ్చు. లేదా ఎక్కడైనా చెట్టు మొదట్లో పోయవచ్చు. పారే నీళ్లలో వదిలిపెట్టవచ్చు. వీటిలో ఏదైనా చేయండి. ఈ గోధుమల దీపం అనేది సూర్యుడి అనుగ్రహాన్ని కలిగింపజేస్తుంది. ధాన్య లక్షి గా లక్ష్మీ కటాక్షాన్ని కూడా కలిగింపజేస్తుందంటున్నారు జ్యోతిష్యులు మాచిరాజు కిరణ్‌కుమార్.

ముఖ్య గమనిక: పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

దీపావళి రోజు 7 నియమాలు పాటిస్తే

లక్ష్మీదేవి అనుగ్రహం!



జీవితంలో వెలుగులు నింపే పండుగ దీపావళి. దీపావళి రోజున లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. దీపావళి రోజు శాస్త్రాల ప్రకారం ఏమేం చేయాలో ఇక్కడ తెలియజేశాం. ఈ పనులు చేయడం వల్ల లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. ఇంట్లో శాంతి నెలకొంటుంది. దీపావళి రోజున ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, లక్ష్మీ పూజలు చేయడం, లక్ష్మీదేవి దివ్య మంత్రాలను జపించడం వల్ల మంచి జరుగుతుంది.

దీపాల పండుగ దీపావళి కేవలం వెలుగుల సంబరం మాత్రమే కాదు. లక్ష్మీదేవి అనుగ్రహాన్ని పొందేందుకు మంచి సమయం. ఈ రోజు నియమనిష్టతో లక్ష్మీదేవికి పూజలు చేయడం వల్ల ఇంట్లో సిరిసంపదలు వస్తాయి. దీపావళి రోజు నవంబర్ 8న లక్ష్మీ పూజ చేయడంతో పాటు కొన్ని ప్రత్యేక నియమాలు పాటిస్తే ఐశ్వర్యం సిద్ధిస్తుంది. లక్ష్మీ కటాక్షం కోసం ఫాలో అవ్వాల్సిన నియమాలు.

ఫాలో అవ్వాల్సిన 7 నియమాలు

పరిశుభ్రత: పరిశుభ్రంగా ఉన్న చోట మాత్రమే లక్ష్మీదేవి ఉంటుంది. మురికిగా ఉన్న ఇంట్లోకి లక్ష్మీదేవి ప్రవేశించదు. కాబట్టి ఇంటిని చక్కగా క్లీన్ చేసుకోండి. దీపావళి అమావాస్య రోజు లక్ష్మీదేవి భూలోకంలో సంచరిస్తూ, పరిశుభ్రంగా ఉన్న ఇంట్లోకి వెళ్లి స్థిర నివాసం ఏర్పరుచుకుంటుందని పండితులు చెబుతున్నారు. కాబట్టి ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి. పూజా మందిరం, వ్యాపార స్థలాలను శుభ్రపరుచుకోండి. దీంతో ఇంటి నుంచి నెగిటివ్ ఎనర్జీ తొలగుతుంది.

ప్రధాన ద్వారం: ఇంటి ప్రధాన ద్వారా నుంచే మహాలక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశిస్తుందని నమ్మకం. ఇంటి ప్రధాన ద్వారం దగ్గర మామిడి ఆకుల తోరణాలు కట్టండి. మెయిన్ డోర్ దగ్గర ముగ్గులు వేయండి. లక్ష్మీదేవి పాదాల ముగ్గు వేయడం మంచిది. ఇది లక్ష్మీదేవికి స్వాగతం పలకడానికి ప్రధాన ఘట్టం.

ప్రదోష కాలంలో లక్ష్మీ-గణపతి పూజ: దీపావళి సాయంత్రం ప్రదోష కాల ముహూర్తంలో గణపతి, మహాలక్షి , సరస్వతి దేవుళ్లకు ఒకేసారి పూజలు చేయండి. నియమనిష్టలతో లక్ష్మీదేవి పూజ చేయండి. శ్రీ మహాలక్ష్మీ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం వంటివి చదవండి. పూజలో లక్ష్మీదేవికి పాయసం, తామరపూలు, పంచామృతాన్ని నైవేద్యంగా సమర్పించాలి. లక్ష్మీ పూజ చేయడం వల్ల ధనప్రాప్తి కలుగుతుంది.

దీపారాధన: దీపావళి రోజు రాత్రి మట్టి ప్రమిదలతో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించండి. పూజ గది, ఇంటి గుమ్మం, బావి వద్ద దీపాలు వెలిగించండి. దీపాల కాంతి అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని తొలగిస్తుంది. ఐశ్వర్యాన్ని అందిస్తుంది.

కుబేర స్థాన ఆరాధన: సంపదలకు అధిపతి అయిన కుబేరుడిని లక్ష్మీదేవితో పాటుగా పూజించడం వల్ల ఆస్తిపాస్తులు స్థిరంగా ఉంటాయి. పూజలో బంగారు, వెండి నాణేలను పీఠంపై ఉంచండి. ఈ సమయంలో ఓం కుబేరాయ నమః అనే మంత్రాన్ని జపించండి.

ధన మంత్ర జపం: లక్ష్మీదేవి పూజ సమయంలో భక్తితో సంకల్పం చెప్పుకొని లక్ష్మీదేవి మంత్రాలు జపించండి. ఓం శ్రీం హ్రీం క్లీం శ్రీం సిద్ధ లక్ష్మై నమః ఈ మంత్రాన్ని 108 సార్లు జపించడంతో ఆర్థిక ఇబ్బందులు నుంచి బయట పడొచ్చు.

నూతన ఖాతా పుస్తకాలు: వ్యాపారులు తమ దగ్గర ఉన్న పాత లెక్కల పుస్తకాలను ముగించి, నూతన ఖాతా పుస్తకాలను ప్రారంభించాలి. ఆ పుస్తకాలకు పూజ చేయాలి. ఇదే రోజు అన్న దానం, వస్త్రదానం చేయడం మంచిది.

దీపావళి రోజు ఫాలో అవ్వాల్సిన 7 నియమాలను నియమనిష్టలతో ఫాలో అవ్వడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయని పండితులు చెబుతున్నారు. దీంతో పాటు దీపావళి రోజు ఉదయాన్నే నిద్రలేవాలి. సూర్యోదయం తర్వాత నువ్వల నూనెతో అభ్యంగన స్నానం చేయాలి. పండగ రోజు కొత్త దుస్తులు ధరించండి. తెలుపు రంగు దుస్తులు ధరించడం ఉత్తమం.

5 రోజుల పండుగ

హిందూ సంప్రదాయంలో పండుగలకు ప్రాధాన్యం ఉంది. పండుగను సాంప్రదాయంగా జరుపుకోవడం వలన ఇంట్లో సానుకూల శక్తులు పెరిగి, సిరి సంపదలకు లోటుండదని శాస్త్రాలు చెబుతున్నాయి. సాధారణం దసరా పండుగ 10 రోజుల పండుగ అయితే సంక్రాతి 4 రోజుల పండుగగా జరుపుకోవడం తెలిసిందే! అయితే దీపావళి పండుగ కూడా 5 రోజుల పండుగ అని తెలుసా! 5 రోజుల దీపావళి పండుగలో ఏ రోజు ఏ వేడుక జరుపుకోవాలో చూద్దాం.

దీపావళి వేడుకలు ఎప్పటి నుంచి?

పెద్దలు కూడా పిల్లలుగా మారిపోయే ఆనంద దీపావళి పండుగ వేడుకలు ఈ ఏడాది నవంబర్ 6, శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇటు సంప్రదాయానికి, అటు ఆధ్యాత్మికతతో పాటు ఆనందాన్ని అందించే దీపావళి పండుగలో ఏ రోజు ఏ పండుగ రానుంది? ఆ విశిష్టత ఏమిటో చూద్దాం.

ధన త్రయోదశి: ధన త్రయోదశి దీపావళి వేడుకల ఆరంభాన్ని సూచించే పండుగ. ఆశ్వయుజ బహుళ త్రయోదశి రోజున ఈ పండుగను జరుపుకుంటారు. ఈ ఏడాది నవంబర్ 6, శుక్రవారం రోజు ధన త్రయోదశి పండుగను జరుపుకోనున్నాం. క్షీరసాగర మథన సమయంలో ఆయుర్వేదానికి అధిదేవత అయిన ధన్వంతరి అమృత కలశంతో ఉద్భవించిన రోజు ఇదే! అందుకే ఈ రోజున ధన్వంతరి జయంతిని కూడా జరుపుకుంటాం. ఈ రోజున బంగారం, వెండి, కొత్త చీపురు, నూతన వాహనాలు, ఉప్పు వంటి వస్తువులు కొనడం శుభప్రదంగా భావిస్తారు.

నరక చతుర్దశి: 5 రోజుల దీపావళి పండుగలో రెండో రోజు నరక చతుర్దశి. ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజు శ్రీకృష్ణుడు తన భార్య సత్యభామతో కలిసి నరకాసుర సంహారం చేసిన సందర్భంగా ఈ రోజును నరక చతుర్దశిగా జరుపుకుంటారు. ఈ రోజున అభ్యంగన స్నానం చేయడం, దక్షిణ దిక్కున యమ దీపాన్ని వెలిగించడం సంప్రదాయం.

దివ్వెల దీపావళి: 5 రోజుల దీపావళి పండుగలో మూడో రోజు అసలైన దీపావళి పండుగ. ఈ రోజు నువ్వుల నూనెలో లక్ష్మీదేవి కొలువై ఉంటుందంట! అందుకే ఈ రోజు సూర్యోదయానికి ముందే నువ్వుల నూనె తలకు, ఒంటికి పెట్టుకుని అభ్యంగన స్నానం చేయాలి. ఇక సాయంత్రం ఇల్లంతా దీపాలు వెలిగించి, లక్ష్మీ పూజ చేసి, బాణాసంచా కాల్చుకోవడం సంప్రదాయం. అనంతరం మిఠాయిలు ఇచ్చి పుచ్చుకుంటారు.

బలి పాడ్యమి: 5 రోజుల దీపావళి పండుగలో నాలుగో రోజు బలి పాడ్యమిగా జరుపుకుంటాం. ఈ రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభం అవుతుంది. శ్రీ మహావిష్ణువు వామనావతారంలో త్రివిక్రముడిగా బలి చక్రవర్తి నుంచి మూడు అడుగులు దానంగా పుచ్చుకుని ముల్లోకాలను ఆక్రమించిన శుభదినం ఈ రోజు. బలి చక్రవర్తి త్యాగానికి మెచ్చిన శ్రీ మహావిష్ణువు కార్తిక శుద్ధ పాడ్యమి రోజు బలి తిరిగి భూమిపైకి వచ్చి తన రాజ్యాన్ని చూసుకొనేలా వరం ఇచ్చాడు కాబట్టి ఈ రోజుకు బలి పాడ్యమి అని పేరు వచ్చింది. ఈ రోజు బలి చక్రవర్తిని, శ్రీ మహావిష్ణువును పూజించడం సంప్రదాయం.

యమ ద్వితీయ: 5 రోజుల దీపావళి పండుగలో ఐదో రోజైన కార్తిక శుద్ధ విదియను యమ ద్వితీయగా జరుపుకుంటాం. పురాణాల ప్రకారం యమధర్మరాజు తన చెల్లెలు యమున ఇంటికి వెళ్లి ఆమె ఇంట భోజనం చేసి, ఆమె ఆతిథ్యాన్ని స్వీకరించాడంట! అందుకే ఈ రోజు అన్నదమ్ములు తమ సోదరి ఇంటికి వెళ్లి ఆమె చేతి భోజనం చేసి ఆమెకు కానుకలు ఇవ్వడం సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని అనుసరించడం వలన అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధం దృఢ పడుతుందని విశ్వాసం. ఇవేనండి 5 రోజుల దీపావళి పండుగ విశేషాలు! ఈ 5 రోజుల దీపావళిని మనం కూడా ఆనందంగా జరుపుకుందాం. మన సంప్రదాయాలను మన భావితరాలకు భద్రంగా అందిద్దాం.



ఈ పనులు చేయకండి

దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మీదేవి అనుగ్రహం పొందేందుకు పాటించాల్సిన ఆచారాలు, సంప్రదాయాల గురించి తెలుసుకోండి. అలాగే పండుగ రోజున చేయకూడని పనులు, కొనుగోలు చేయకూడని వస్తువులు ఏమిటో తెలుసుకుందాం.

దీపావళి.. దేశవ్యాప్తంగా ఎంతో వైభవంగా జరుపుకునే ప్రధాన పండుగల్లో ఒకటి. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి, కొత్త బట్టలు ధరించి పండుగను ఆనందంగా జరుపుకుంటారు. అయితే దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించడం, మిఠాయిలు పంచుకోవడం మాత్రమే కాదు. ఈ పండుగకు పౌరాణిక ప్రాధాన్యంతో పాటు అనేక ఆచారాలు, సంప్రదాయాలు కూడా ఉన్నాయి.



పౌరాణిక కథనం ప్రకారం.. శ్రీరాముడు 14 ఏళ్ల వనవాసం పూర్తి చేసుకుని సీతాదేవి, లక్ష్మణుడితో కలిసి అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా అక్కడి ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారు. అప్పటి నుంచి దీపావళి పండుగను దీపాల పండుగగా జరుపుకుంటున్నారని ప్రతీతి. ఇక దక్షిణ భారతదేశంలో శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన విజయానికి గుర్తుగా నరక చతుర్దశిని జరుపుకుంటారు.

లక్ష్మీదేవి అనుగ్రహం కోసం ఏం చేయాలి?

దీపావళి రోజున లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే ఇంట్లో సుఖసంతోషాలు, సంపద, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల నమ్మకం. వరంగల్‌కు చెందిన అర్చకులు ఖాళీ ప్రసాద్ శర్మ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ పర్వదినాన కొన్ని సంప్రదాయాలను పాటించడం ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తారు. తెల్లవారుజామున అభ్యంగన స్నానం చేయడం, ఇంటిని శుభ్రం చేసి అందంగా అలంకరించడం, గుమ్మం ముందు ముగ్గులు వేయడం, సాయంత్రం దీపారాధన చేయడం వంటి ఆచారాలు పాటిస్తారు. అనంతరం సంప్రదాయబద్ధంగా లక్ష్మీదేవికి పూజలు నిర్వహిస్తారు. ఇలా భక్తితో పూజించడం వల్ల ఇంట్లో సానుకూల వాతావరణం నెలకొంటుందని విశ్వసిస్తారు.

దీపావళి రోజున చేయకూడని పనులు ఇవే..

పండుగ రోజున కుటుంబ సభ్యులతో, ఇతరులతో గొడవలు పడకూడదని పెద్దలు చెబుతారు. కోపం, అసహనం ప్రదర్శించకుండా ప్రశాంతంగా, సంతోషంగా ఉండాలి.

ఉపయోగం లేని పాత వస్తువులు, పనికిరాని సామాన్లు ఇంట్లో పేరుకుపోకుండా ముందుగానే తొలగించుకోవాలి. పండుగకు ముందు ఇంటిని శుభ్రం చేసుకోవడం శుభప్రదంగా భావిస్తారు.

దీపావళి రోజున లక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశిస్తుందని నమ్ముతారు. అందుకే సాయంత్రం దీపాలు వెలిగించే సమయంలో ఇంటి ప్రధాన ద్వారాన్ని తెరిచి ఉంచాలని సంప్రదాయంగా చెబుతారు.

దీపావళి రోజున ఇతరులకు అప్పు ఇవ్వడం లేదా అప్పు తీసుకోవడం మంచిది కాదని కొందరు పెద్దలు సూచిస్తారు. అందుకే ఆర్థిక లావాదేవీల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతారు.

హిందూ సంప్రదాయంలో ఇనుమును శనిదేవుడికి సంబంధించిన లోహంగా భావిస్తారు. దీపావళి రోజున ఇనుముతో చేసిన వస్తువులు కొనుగోలు చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని విశ్వాసం.

కత్తులు, కత్తెర్లు, సూదులు వంటి పదునైన వస్తువులను పండుగ రోజున కొనుగోలు చేయకూడదని వాస్తు సంప్రదాయాలు సూచిస్తున్నాయి. ఇవి ఇంట్లో అశాంతికి, గొడవలకు సంకేతంగా భావిస్తారు.

హిందూ సంప్రదాయంలో నలుపు రంగును కొన్ని శుభకార్యాలకు దూరంగా ఉంచుతారు. అందుకే దీపావళి రోజున నల్లని దుస్తులు లేదా వస్తువులు కొనుగోలు చేయకూడదని కొందరు సూచిస్తారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.11.2026
www.mudranews.in | @mudranews

ఇంట్లో స్వచ్ఛమైన గాలి ఉండేలా చూసుకోండి
బయట టపాసుల పొగ ఎక్కువగా ఉన్నప్పుడు కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
అందుబాటులో ఉంటే ఎయిర్ ప్యూరిఫైయర్ ఉపయోగించుకోవాలి.



17 ఏళ్ల నిరీక్షణకు తెర..

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు
ఫ్లాట్లపై 17 ఏళ్లుగా కొనసాగుతున్న వివాదం
101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం
కొనుగోలుదారులకు అత్యున్నత న్యాయస్థానంలో భారీ ఊరట
14 శాతం వడ్డీ వసూలుపై హైకోర్టుదే తుది నిర్ణయమని స్పష్టీకరణ
కేసు తేలే వరకు ఆస్తులు అమ్మరాదని ఇరువర్గాలకు ఆంక్షలు



ముద్ర, కూకట్ పల్లి : కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (KPHB) ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లితో కూడిన ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది.2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్‌సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది.ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

జే ఎన్ టీ యూ లో అదనపు స్పెషల్ ఫీజు సర్క్యులర్‌ను ఉపసంహరించుకోవాలి

స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం



ముద్ర, కూకట్‌పల్లి :జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ పరిధిలోని యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం సమర్పించారు.అడ్మిషన్ సమయంలోనే విద్యార్థుల నుంచి ₹2,500 స్పెషల్ ఫీజు వసూలు చేసినప్పటికీ, తాజాగా నవంబర్ 03న మరో ₹1,500 అదనపు స్పెషల్ ఫీజు చెల్లించాలంటూ జారీ చేసిన సర్క్యులర్‌పై విద్యార్థి నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు దార్ల సుజయ్ మాట్లాడుతూ—— అడ్మిషన్ పొందిన సమయంలో ఉన్న ఫీజు నిబంధనలే కోర్సు పూర్తయ్యే వరకు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్‌కు సమాచారం లేకుండా ఇలాంటి సర్క్యులర్ బయటకు రావడం దురదృష్టకరమని, దీనిపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.అదనంగా ₹1,500 వసూలు చేసే ఉత్తర్వులను వెంటనే నిలిపివేయాలి.ఇప్పటికే ఫీజు చెల్లించిన విద్యార్థుల సొమ్మును వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి.విశ్వవిద్యాలయ అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి సాధించాలి తప్ప విద్యార్థులపై భారం వేయకూడదు.ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే విద్యార్థుల పక్షాన తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు స్టాలిన్, అక్షిత్, నవీన్, జ్ఞానేశ్వర్, రోహిత్, రాజ్ కుమార్, సాగర్, దుర్గాప్రసాద్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్యేకు లేదు

ప్రభుత్వ భూముల అమ్మకాలపై ఆరోపణలు అబద్ధం
కృష్ణారావుకు బండి రమేష్ సవాల్
గత బీఆర్ఎస్ (టీఆర్ఎస్) హయాం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం
మీడియా సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్



ముద్ర, కూకట్‌పల్లి : తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం భూములను అమ్ముకుంటోందంటూ కూకట్‌పల్లి శాసన సభ్యుడు మాధవరం కృష్ణారావు చేసిన ఆరోపణలను టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేష్ తీవ్రంగా తిప్పి కొట్టారు. శుక్రవారం కృష్ణారావు చేసిన విమర్శలకు స్పందిస్తూ, శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయమైన 'హేమదుర్గ భవన్'లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే ప్రభుత్వ భూముల అమ్మకాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. దమ్ముంటే కృష్ణారావు తాను చేసిన ఆరోపణలపై నిలబడి చర్చకు రావాలని సవాల్ విసిరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విమర్శలు చేసేటప్పుడు ఎమ్మెల్యే కృష్ణారావు నోరు సంబాళించుకుని మాట్లాడాలని బండి రమేష్ హెచ్చరించారు. "కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిని పరుగులు తీస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి తట్టుకోలేకనే కృష్ణారావుతో పాటు ఇతర బీఆర్ఎస్ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు" అని మండిపడ్డారు. 'బంగారు తెలంగాణ' పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం సుమారు రూ. 8.5 లక్షల కోట్ల అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రజల నెత్తిన పెట్టి పోయిందని ఆయన ధ్వజమెత్తారు.కూకట్‌పల్లి నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు, అక్రమ నిర్మాణాలకు ఎమ్మెల్యే కృష్ణారావు మరియు ఆయన అనుచరులే మూలకారకులని రమేష్ ఆరోపించారు. కేవలం హౌసింగ్ బోర్డు అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు వెచ్చించానని కృష్ణారావు చెప్పడం పచ్చి అబద్ధమని, దీనిపై ప్రత్యక్ష చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.కేపీహెచ్‌బీ కాలనీలో కనీసం ఒక ప్రభుత్వ పాఠశాల లేదా ఆసుపత్రి కూడా నిర్మించలేక గత ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. చివరకు స్కూలు నిర్మాణం కోసం తెచ్చిన ఐరన్/స్టీల్‌ను కూడా బీఆర్ఎస్ నాయకులు అమ్ముకున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కృష్ణారావు, తన 12 ఏళ్ల పాలనలో కూకట్‌పల్లికి ల్యాండ్‌మార్క్‌గా నిలిచే ఏ ఒక్క పనిచేశాడో చూపించాలి. పేద ప్రజల కోసం ఎన్ని ఇళ్లు కట్టించారో బహిర్గతం చేయాలి" అని రమేష్ సవాల్ విసిరారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం ఐటీ, పారిశ్రామిక మరియు ఉత్పాదక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని బండి రమేష్ వివరించారు. ఎల్ నినో (El Niño) ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాల్లో కరువు పరిస్థితులు నెలకొంటే, దాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగడుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కరువు నివారణతో పాటు సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో నిరంతరం సమీక్షిస్తూ అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం హౌసింగ్ బోర్డు పరిధిలో 11 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించిందని రమేష్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఇప్పటికే 400 ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని, రెండో విడతలో మరో 3,000 ఇళ్ల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభించబోతున్నామని చెప్పారు. తాను, అధికారులు నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో రోజువారీగా పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

కేపీహెచ్‌బీలో ప్రభుత్వ స్థలాల వేలానికి వ్యతిరేకంగా జనసేన భారీ నిరసన ర్యాలీ



ముద్ర, కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీలో ప్రభుత్వం చేపడుతున్న స్థలాల వేలం పాటలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర జాయింట్ కమిటీ కన్వీనర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ నాయకత్వంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాల కోసం సేకరించిన ఫిష్ మార్కెట్ పక్కన ఉన్న స్థలం, ట్రక్ పార్క్ స్థలంతో పాటు పబ్లిక్ పార్కులు, ఆసుపత్రులు, పాఠశాలలు, పెట్రోల్ బంకులకు కేటాయించిన స్థలాలను వేలం పేరిట విక్రయించడం సరికాదన్నారు. ప్రజా ఆస్తులను కాపాడటమే ధ్యేయంగా తమ పోరాటం కొనసాగుతుందని, వేలం ప్రక్రియను రద్దు చేసే వరకు నిరసనలు ఆపేది లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ నిరసన ర్యాలీలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వేలం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో కాలనీ వాసులు, కాలనీ సంఘాలతో కలిసి వేలం పాటలను అడ్డుకుంటామని, ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, వేముల మహేష్, బోగాది వెంకటేశ్వర్ రావు, నాగేంద్ర, పండుగ సూర్య, అశోక్ మాదాసు, డి. వెంకట్, శ్రీనివాస్ గోవింద్, అంజి, పవన్, ప్రసన్న ఆంజనేయులు, సుదర్శన్, రాము, ప్రసాద్ నాయుడు, మురళి, శివశంకర్, శేఖర్, గోపి, నిరజ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.9.11 కోట్ల పనులకు శంకుస్థాపన

ముద్ర ప్రతినిధి, మెదక్:



మెదక్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.9.11 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రహదారులు, సీసీ డ్రైనేజీలు, పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, స్టామ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం తదితర పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ... మెదక్ పట్టణ అభివృద్ధి తన ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా కల్పించేందుకు ప్రభుత్వం సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.మెదక్ పట్టణంలోని ధ్యాన్ చంద్ చౌరస్తా జంక్షన్ అభివృద్ధికి రూ.80 లక్షలు, అంబేద్కర్ చౌరస్తా జంక్షన్ అభివృద్ధికి రూ.50 లక్షలు కేటాయించి పనులు చేపడుతున్నామన్నారు. ఈ రెండు ప్రధాన కూడళ్లను ఆధునీకంగా అభివృద్ధి చేయడం ద్వారా ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడటంతో పాటు పట్టణానికి మరింత అందం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వార్డు 18 పరిధిలోని టీచర్స్ కాలనీ పార్కును చిల్డ్రన్ పార్క్‌గా, ప్రకృతి వనంగా అభివృద్ధి చేయడంతో పాటు అమరవీరుల స్తూపం పరిసరాలను మెరుగుపరిచేందుకు రూ.35 లక్షలు కేటాయించారు. అదేవిధంగా వార్డు 8 పరిధిలోని పాత చిల్డ్రన్ పార్క్ అభివృద్ధికి రూ.1.65 కోట్లు వెచ్చించనున్నారు.ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మెదక్ మున్సిపల్కానుగు రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు యం గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ రాగి అశోక్, మున్సిపల్ కౌన్సిలర్స్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు వార్డులలో బైక్ పై తిరుగుతూ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సర్కిళ్ల పనులను పరిశీలించారు.

ఆర్టీసీ కండక్టర్ అనిత బ్రెయిన్ డెడ్ తో మృతి

అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు





ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ ఆర్టీసీ డిపో కండక్టర్ కుమ్మరి అనిత అకాల మరణం చెందారు. రక్తపోటు కారణంగా అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురైన అనితను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిమ్స్ కు తరలించారు. వైద్యుల ప్రయత్నం వృధా అయింది. బ్రెయిన్ డెడ్‌కు గురై మృత్యువుతో పోరాడుతూ తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. అనిత ఆమె భర్త కుమ్మరి అంజయ్య ఇద్దరు మెదక్ డిపోలో కండక్టర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. అవయవదానం..మరికొందరికి ప్రాణదానం ఆర్టీసీ కండక్టర్ అనిత అకాల మరణంతో తీవ్ర విషాదంలో ఉన్నప్పటికీ, ఆమె అవయవాలను జీవన్‌ధాన్‌కు దానం చేయాలని భర్త కుమ్మరి అంజయ్య, కుటుంబ సభ్యులు గొప్ప మనసును చాటుకున్నారు. తమ వ్యక్తిగత దుఃఖాన్ని పక్కనపెట్టి, మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే కుటుంబ సభ్యుల నిర్ణయం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆమె అంత్యక్రియలు స్వగ్రామం చిలిపిచెడ్ మండలం గౌతాపూర్ లో జరిగాయి. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఆర్టీసీ ఉద్యోగులు కన్నీటి వీడ్కోలు పలికారు.

కండక్టర్ అనిత మృతి పట్ల మంత్రి పొన్నం సంతాపం

కుమ్మరి అనిత మృతి పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు.అనిత కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.తీవ్ర విషాదంలోనూ అనిత కుటుంబ సభ్యులు నిమ్స్ ఆసుపత్రిలో అవయవదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని మంత్రి పేర్కొన్నారు. అవయవదానం ద్వారా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపడం గొప్ప మానవతా దృక్పథానికి నిదర్శనమని తెలిపారు.అనిత మరణం బాధాకరమని, ఆమె అవయవదానం ద్వారా ఇతరులకు ప్రాణదానం చేయడం సమాజానికి స్ఫూర్తిదాయకమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 8.11.2026
www.mudranews.in | @mudranews

టాపాసుల పొగ : ఆస్తమా మందులు ఆపకండి:

లక్షణాలు తగ్గాయని భావించి కంట్రోలర్ మందులను సొంతంగా నిలిపివేయ కూడదు. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండటం, మాట్లాడలే కపోవడం, పెదవులు నీలంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే అత్యవసర వైద్య సహాయం పొందాలి.



కొడంగల్‌లో పారిశ్రామిక ప్రగతికి కొత్త అధ్యాయం

943 ఎకరాల్లో రేర్ ఇండస్ట్రియల్ హబ్.. రూ.252.86 కోట్ల పెట్టుబడులు

ముద్ర, మహబూబ్ నగర్: కొడంగల్ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రగతికి కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన రేర్ ఇండస్ట్రియల్ హబ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాదాపు 100 మంది పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశమై పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహా, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొడంగల్ పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్ విమానాశ్రయ ప్రాంతం, ఇతర పారిశ్రామిక క్లస్టర్లకు చెందిన ఏరోస్పేస్, రక్షణ, గ్రీన్ టెక్నాలజీ, పునరుత్పాదక ఇంధనం, ఉక్కు, రాగి, టెక్స్‌టైల్, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



మొత్తం 943.34 ఎకరాల్లో అభివృద్ధి చేస్తున్న ఈ పారిశ్రామిక హబ్‌లో రోడ్లు, నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.441.91 కోట్ల వ్యయ ప్రణాళిక రూపొందించారు. భూసేకరణ కోసం ఇప్పటికే రూ.220 కోట్లు ఖర్చు చేశారు. రేడియల్ రోడ్డు వెంట ఉండటంతో పరిశ్రమలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.ఇప్పటికే రెండు సంస్థలకు 96 ఎకరాల భూమిని కేటాయించారు. బిర్లా నూ లిమిటెడ్ ఫైబర్ సిమెంట్ బోర్డుల తయారీ పరిశ్రమను, ఎకోపామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెజిటబుల్ ఆయిల్స్, వ్యవసాయ పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టనున్నాయి. ఈ రెండు సంస్థల ద్వారా రూ.252.86 కోట్ల పెట్టుబడులతో పాటు సుమారు 535 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.పరిశ్రమలను హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించి, స్థానిక యువతకు వారి ప్రాంతాల్లోనే ఉపాధి కల్పించాలన్నదే ఈ హబ్ ప్రధాన లక్ష్యం.

పేదల సొంతింట్లో దీపావళి వెలుగులు: మంత్రి పొన్నం ప్రభాకర్

ముద్ర, హుస్నాబాద్, : దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను ప్రజాపాలన ప్రభుత్వం సాకారం చేస్తోందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పేద కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నిండుతున్నాయని పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో శనివారం నిర్వహించిన 'మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని లబ్ధిదారుల కుటుంబంతో కలిసి దీపావళి సంబరాలు జరుపుకున్నారు.హుస్నాబాద్‌కు చెందిన పొన్నం కోమల–సమ్మయ్య ముదిరాజ్ దంపతులు దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ నేపథ్యంలో వారి నూతన గృహంలో నిర్వహించిన దీపావళి వేడుకలకు మంత్రి హాజరయ్యారు. లబ్ధిదారు కుటుంబానికి నూతన వస్త్రాలు అందించి, స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.



2,500కు పైగా ఇళ్లలో దీపావళి సంబరాలు..

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి మొదటి విడతలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికే 2,500కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడిం చారు.500 గుడిసెల స్థానంలో నూతన ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో పాటు, మధ్యలో నిలిచిపోయిన మరో 500 ఇళ్లకు, రెండో దశలో అదనంగా 1,000 ఇళ్లకు మంజూరు లభించిందని తెలిపారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు.రెండో దశలో మంజూరైన ఇళ్లకు సంబంధించి మరో వారం, పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియ పూర్తి చేస్తామని ప్రకటించారు. రూఫ్ లెవల్‌కు చేరుకున్న లబ్ధిదారులు కూడా త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు.హుస్నాబాద్ నియోజకవర్గం లోని ఏడు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ సొంతింట్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

గోదావరి-కృష్ణా అనుసంధానమే శాశ్వత పరిష్కారం

ఏదుల నుంచి నీళ్లు తెస్తామనడం సాధ్యం కాని ప్రతిపాదన: కల్వకుంట్ల కవిత

ముద్ర, నల్గొండ: డిండి రిజర్వాయర్ కు ఏదుల నుంచి నీళ్లు తెస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు జిల్లాల ప్రజలను మోసం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఏదులకే రెండు టీఎంసీల నీటిని తీసుకురాలేని పరిస్థితుల్లో అక్కడి నుంచి డిండికి ఎలా నీళ్లు తెస్తారని ప్రశ్నించారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో పాటు కాళేశ్వరం అడిషనల్ టీఎంసీ ద్వారా బస్వాపూర్ మీదుగా డిండికి నీటిని తరలించడమే శాశ్వత పరిష్కారమని స్పష్టం చేశారు. శనివారం డిండి రిజర్వాయర్ వద్ద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ప్రతిపాదనలను వివరించారు. ఎల్లూరు పంపుహౌస్ డిజైన్ మార్పులతో పాలమూరు ప్రాజెక్టుకు నష్టం జరిగిందని ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రతిపాదనలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు చేశారు. నల్గొండలో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు చిన్న రిజర్వాయర్లు నిర్మిస్తామని తెలిపారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన బీఆర్ఎస్ నాన్ పర్ఫార్మింగ్ అసెట్ గా మారిందని, ప్రజా సమస్యలపై పోరాడుతూ పరిష్కారాలు సూచిస్తున్నది తమ పార్టీయేనని కవిత పేర్కొన్నారు.

ధరణి అక్రమాలపై సీఐడీ కొరడా

15 ప్రత్యేక బృందాలతో ఏకకాలంలో సోదాలు!
మరో ఐదుగురు అదుపులోకి.. ఇప్పటివరకు తొమ్మిది మందిపై చర్యలు

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో ధరణి పోర్టల్ భూ రికార్డుల అక్రమాల వ్యవహారంపై సీఐడీ దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15 ప్రత్యేక బృందాలతో రెండు రోజులపాటు ఏకకాలంలో విస్తృత తనిఖీలు నిర్వహించింది. తాజాగా మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుంది. ఇప్పటికే నలుగురిని అరెస్టు చేయడంతో ఇప్పటివరకు ఈ కేసులో తొమ్మిది మందిపై చర్యలు తీసుకున్నట్లయింది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్, భువనగిరి, గజ్వేల్ తదితర ప్రాంతాల్లో సీఐడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ధరణి పోర్టల్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన ఆపరేటర్లు, డేటా ఎంట్రీ సిబ్బందిని విచారించారు. పోర్టల్‌లో అక్రమంగా లాగిన్ అయి విలువైన భూముల యాజమాన్య హక్కులకు సంబంధించిన రికార్డులను మార్చినట్లు ప్రాథమికంగా ఆధారాలు సేకరించినట్లు సమాచారం.

కోర్టు ఉత్తర్వుల మాటున అక్రమాలు?

న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, కోర్టులు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను ఆసరాగా చేసుకుని భూ రికార్డుల్లో అక్రమ మార్పులు చేసినట్లు సీఐడీ అనుమానిస్తోంది. ముఖ్యంగా అత్యంత విలువైన భూదాన్ భూములకు అక్రమంగా బైనంబర్లు సృష్టించి, వాటి యాజమాన్య హక్కులను ఇతరులకు బదిలీ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ వ్యవహారంలో మరికొందరి పాత్రపైనా సీఐడీ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సేకరించిన ఆధారాలను విశ్లేషిస్తున్నారు. అయితే ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సీఐడీ ఉన్నతాధికారులు వెల్లడించలేదు. రానున్న ఒకటి రెండు రోజుల్లో ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. ధరణి పోర్టల్‌లో భూ రికార్డుల మార్పులు, అక్రమ లావాదేవీల వెనుక ఉన్న వ్యక్తులు, ఇతర సంబంధిత అంశాలపై సీఐడీ దర్యాప్తు కొనసాగుతోంది.

60 ఏళ్లకు ఒకసారి చందనోత్సవం..

నెలరోజులపాటు నిజరూప దర్శనం

ముద్ర, జగిత్యాల : జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో చందనోత్సవానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 60 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే అరుదైన చందనోత్సవం అనంతరం స్వామివారు నిజరూపంలో దర్శనమిస్తారు. ఈ నెల 15 నుంచి 20 వరకు 5 రోజులపాటు చందనోత్సవం, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు జరగనున్నాయి. స్వామివారి మూల విరాట్ పైనా చందనం తొలగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం నెలరోజులపాటు భక్తులకు ఆంజనేయ స్వామి నిజరూప దర్శనం కల్పిస్తారు. బాల్యదశలో చందనోత్సవాన్ని కనులారా చూసినవారు మళ్లీ మలిదశలో మాత్రమే దర్శించుకునే భాగ్యం లభిస్తుందని అర్చకులు చెబుతున్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

ముద్ర, కరీంనగర్ : కరీంనగర్ జిల్లా చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము శివ (20) అనే యువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న చందుర్తి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కరువు మండలాల రైతులకు ఆర్థిక సహాయం చేయాలి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



ముద్ర, జగిత్యాల : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అవగాహనారాహిత్యంతో రాష్ట్రంలో రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కరువు మండలాల రైతులకు ఆర్థిక సహాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న వరి, పత్తి పొలాలను శనివారం పరిశీలించారు. పంటలు ఎండిపోయి తీవ్ర ఆందోళనలో ఉన్న మండల లింగయ్య, మండల భీమయ్య, చంద్రయ్య తదితర రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. రైతులు పెట్టుబడులు పెట్టినా చేతికి వచ్చే సమయంలో నీరు అందక పంటలు వృథా అవుతున్నాయని, కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని వాపోయారు.

ఇద్దరు పిల్లలు సహా చెరువులో దూకి తల్లి ఆత్మహత్య

ముద్ర, ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలతో కలిసి మండలంలోని పాకాల చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. మృతులను గీసుకొండ మండలం ఎల్కతుర్తి హవేలీకి చెందిన మమత, తన ఇద్దరు కుమార్తెలుగా గుర్తించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం.

ఇంట్లోంచి బయటకు..

యువతి హత్య

ముద్ర, గాంధారి: ఓ యువతి హత్యకు గురైన ఘటన కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల, పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డికి చెందిన ఆర్తి కౌర్ (19) తల్లిదండ్రులతో కలిసి హైదరాబాదులో నివాసం ఉంటోంది. గాంధారిలోని తన అమ్మమ్మ ఇంటికి వారంరోజుల క్రితం వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి బయటకు వచ్చిన యువతి తిరిగి ఇంటికి వెళ్లలేదు. శనివారం ఉదయం ఆర్తి కనిపించడం లేదని బంధువులు చుట్టుపక్కల గాలించగా సెల్ టవర్ వద్ద గాయాలతో విగతజీవిగా కనిపించింది. సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వీరయ్య చౌదరి, సీఐ సంతోష్, ఎస్సై మహేందర్ డాగ్స్ స్క్వాడ్‌తో ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇటీవలే యువతికి నిశ్చితార్థం అయినట్లు బంధువులు పేర్కొన్నారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు.

ప్రముఖ పాత్రికేయులు రాఘవాచారికి ఘనంగా నివాళి



ముద్ర, హైదరాబాద్ : సుప్రసిద్ధ పాత్రికేయులు, 'విశాలాంధ్ర' దినపత్రిక పూర్వ సంపాదకులు , సి. రాఘవాచారి ఏడవ స్మారకోపన్యాస కార్యక్రమం నవంబర్ 7 వ తేదీ సాయంత్రం విజయవాడ ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. సి.రాఘవాచారి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. "సంక్షోభంలో ప్రజాస్వామ్యం" అంశంపై ఆయన సి.రాఘవాచారి స్మారకోపన్యాసం చేశారు. సభకు ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (IJU) సెక్రటరీ జనరల్ డి. సోమ సుందర్ అధ్యక్షత వహించారు. తొలుత రాఘవాచారి చిత్రపటానికి డా . కాంగో పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఐ జాతీయ నాయకులు డా.కే.నారాయణ, అక్కినేని వనజ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య , రాఘవాచారి ట్రస్టు సభ్యులు పుష్పాంజలి ఘటించారు. ట్రస్టు కార్యకలాపాలపై మేనేజింగ్ ట్రస్టీ కే. జ్యోత్స నివేదిక ఇచ్చారు. ప్రొఫెసర్ బి. జమీందార్ స్వాగతం పలుకగా, డా.సి.అనుపమ వందన సమర్పణ చేశారు. డా.కాంగో ను ట్రస్టు తరపున సత్కరించారు. విజయవాడ నగరానికి చెందిన మేధావులు, ప్రముఖులు, వామపక్షాల కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాగునీటితో ఫ్లోర్‌క్లీనింగ్.. రూ.20వేల జరిమానా

ముద్ర, హైదరాబాద్: తాగునీరు వృథా చేస్తున్న వారిపై జలమండలి కఠిన చర్యలు చేపడుతోంది. ఫ్లోర్ క్లీనింగ్‌కు తాగునీరు వాడినందుకు రూ.20 వేల జరిమానా విధించింది. జూబ్లీహిల్స్‌లోని అక్షయకల్ప ఫార్మ్స్ అండ్ ఫుడ్స్ సంస్థపై ఈమేరకు చర్యలు చేపట్టింది. జరిమానాతో పాటు తాగునీటి కనెక్షన్‌ను తాత్కాలికంగా తొలగించింది. ఇప్పటికే నీటి వృథాపై దృష్టి సారించిన జలమండలి.. హైదరాబాద్‌లోని పలు పబ్‌లు, హోటళ్లకు జరిమానాలు విధించింది.

హైదరాబాద్ మహానగరంలో తాగునీటి దుర్వినియోగం, నీటి వృథాపై పౌరులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా జలమండలి 'పానీ' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పానీ యాప్‌ను నగరవాసులు డౌన్‌లోడ్ చేసుకుని నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదు చేయాలని కోరింది.




టాటా ఏస్ వాహనంలో మంటలు.. తప్పిన ప్రమాదం

ముద్ర, మంచిర్యాల : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బూరుగూడ సమీపంలో 363 జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న టాటా ఏస్ వాహనంలో మంటలు చెలరేగాయి. ఆ సమయంలో వాహనంలో ఎనిమిది మంది ప్రయాణికులు ఉన్నారు. మంటలను గుర్తించిన డ్రైవర్ వెంటనే వాహనాన్ని నిలిపి ప్రయాణికులను కిందకు దించేశారు. దీంతో ప్రాణాపాయం తప్పింది. లేకపోతే 8 మంది ప్రాణాలకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉండేది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.11.2026
www.mudranews.in | @mudranews

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



ఆస్తమా ఉన్న పిల్లల్లో వేగంగా శ్వాస తీసుకోవడం, అలసట, ఆట మధ్యలోనే ఆపేయడం వంటి లక్షణాలను గమనించాలి. ఇలాంటి మార్పులు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి.

ఇందిరమ్మ ఇళ్లతో పేదలకు ఆత్మగౌరవం..

ప్రతి పేద కుటుంబం సొంతింట్లో పండుగలు జరుపు కోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
కొండపర్తిలో లబ్ధిదారుడి కుటుంబంతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సీతక్క



ముద్ర, ములుగు, నవంబరు 7:పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారికి ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రతి పేద కుటుంబం సొంతింట్లో సంతోషంగా పండుగలు జరుపుకోవాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని పేర్కొన్నారు. అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుడు ఈసం నాగరాజు నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు కుటుంబ సభ్యులతో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకుంటూ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలకు గృహ వసతి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నాగరాజు కుటుంబం సొంతింట్లో పండుగ జరుపుకోవడం చూస్తుంటే ఎంతో సంతృప్తిగా ఉందని పేర్కొన్నారు.గ్రామాభివృద్ధికి ప్రత్యేక చర్యలుగతంలో గవర్నర్‌గా పనిచేసిన జిష్ణుదేవ్ వర్మ కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకుని మహిళల అభ్యున్నతితో పాటు గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించిన విషయాన్ని సీతక్క గుర్తుచేశారు. ఈ గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఇళ్లు లేని పేదలకు సొంతింటి వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు.ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించడంతో పాటు వారి జీవితాల్లో భరోసా, భద్రత, ఆత్మగౌరవం పెంపొందించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కొండపర్తి గ్రామ ప్రజలకు, కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, సునీల్, కల్తి రమేష్, గ్రంథాలయ సంస్థ, పీఏసీఎస్ ప్రతినిధులు, తాజా, మాజీ సర్పంచులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భరత్ కుమార్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం



ముద్ర, దేవరకొండ: భారతీయ జనతా పార్టీ కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు శ్రీ భూతరాజు భరత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని, బ్రదర్స్ బ్లడ్ డొనేషన్ ఆధ్వర్యంలో కొండమల్లేపల్లి చౌరస్తాలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన దేవరకొండ నియోజకవర్గం ఇన్చార్జ్ లాలు నాయక్ రంగారెడ్డి జిల్లా సెక్రటరీ నరేష్ యాదవ్ నల్గొండ జిల్లా మాజీ పార్లమెంట్ కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలను కాపాడవచ్చని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంపొందించుకోవాలని నిర్వాహకులు తెలిపారు.రక్తదానం మహాదానం – ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానం అనే నినాదంతో నిర్వహించిన ఈ శిబిరం ద్వారా సామాజిక సేవా భావాన్ని చాటుకున్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంతో నిర్వహించడం అభినందనీయమని పలువురు నాయకులు, పాల్గొన్న వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రక్తదాన శిబిరానికి సహకరించిన వైద్య సిబ్బందికి, రక్తదాతలకు, నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు జంగిటి మల్లేష్ యాదవ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం పద్మావతి యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు నెల్లికంటి గోపి , సున్న మహేష్ యువమోర్చా మండల అధ్యక్షుడు గణేష్ యాదవ్, దాసు గురుస్వామి పరమేష్ గురుస్వామి అంజన్ సాయి ఉదయ చందు నాగ మధు హేమంత్ వేణు వంశీ విజయ నాయక్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

కలెక్టర్ దివాకర
ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 7 : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులకు భారత ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లు, పొరపాటున ఏఎస్డీ (Absent, Shifted, Dead, Duplicate) జాబితాలో చేరిన వారు నవంబర్ 21వ తేదీ వరకు తమ ఫారాలను సమర్పించవచ్చని పేర్కొన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటరు జాబితా నుంచి తొలగించకుండా ఉండాలనే ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.ఏఎస్డీ జాబితాలో పేరు ఉండి ఇప్పటికీ అదే నివాసంలో ఉంటున్న ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అబ్బెండెక్స్–బి (Annexure–B) ను జత చేసి అందించాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర పరిధిలోనే వేరే ప్రాంతానికి నివాసం మార్చిన వారు ప్రత్యేకంగా ఫారం–8 నింపాల్సిన అవసరం లేదని, వారు ఎన్యుమరేషన్ ఫారంతో పాటు అబ్బెండెక్స్–సి (Annexure–C), కొత్త చిరునామా ధృవీకరణ పత్రాన్ని స్థానిక ERO లేదా AERO కి సమర్పిస్తే సరిపోతుందన్నారు. ఇదివరకే ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బీఎల్ఓలు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరు జాబితాలో చేర్చేలా క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

13న అదాలత్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 7 : పెన్షనర్లు, ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న ఖమ్మం కలెక్టరేట్‌లో పెన్షన్–జీపీఎఫ్ అదాలత్–కమ్–వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో పెన్షన్ కేసులు, జీపీఎఫ్ అంశాలు, ఏసీ బిల్లులు, ట్రెజరీ అభ్యంతరాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, అర్హులైన వారికి పీపీఓలు, జీపీఎఫ్ ఆథరైజేషన్ లేఖలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, డీడీఓలు అవసరమైన సర్వీస్ బుక్కులు, రికార్డులతో తప్పనిసరిగా హాజరుకావాలని, పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

సంస్కృతి స్కూల్లో దీపావళి సంబరాలు



ముద్ర, దేవరకొండ: కొండమల్లేపల్లి లోని సంస్కృతి ద స్కూల్లో దీపావళి వేడుకలు ఎంతో ఘనంగా, సాంప్రదాయబద్ధంగా జరిగాయి. చిన్నారులు రంగురంగుల సాంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో పాల్గొని అందరినీ ఆకట్టుకున్నారు.పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పూలతో అందమైన ముగ్గు వేశారు. దీపాలతో అలంకరించి, పూలతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. చిన్నారులు దీపాలను వెలిగించి దీపావళి పండుగ విశిష్టతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సంస్కృతి స్కూల్ డైరెక్టర్ కట్టా వెంకటరెడ్డి,కరస్పాండెంట్ కట్టా శిరీష రెడ్డి, ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు ఈ విధంగా వారు మాట్లాడుతూ పర్యావరణహిత దీపావళిని జరుపుకోవాలని, టపాసులకు దూరంగా ఉండి, దీపాలతో వెలుగులు నింపాలని ఉపాధ్యాయులు పిల్లలకు సూచించారు. పండుగ అంటే కేవలం సంబరాలు మాత్రమే కాదని, ప్రేమ, ఆనందం, ఐక్యత పంచుకోవడమని తెలిపారు.వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పాటలు పాడి, నృత్యాలు చేసి అందరినీ అలరించారు.ఉపాధ్యాయులు, పిల్లల ఉత్సాహాన్ని చూసి అభినందించారు.

భువనగిరిలో పండుగల సాయన్న
విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కలెక్టర్, కమిషనర్ కు వినతి
ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాబిన్ హుడ్ "పండుగల సాయన్న " విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ భువనగిరి పట్టణ కమిటి అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, భువనగిరి మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాబిన్ హుడ్ గా పేరుగాంచిన వీరుడు "పండుగల సాయన్న" విగ్రహాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ని భువనగిరి పెద్ద చెరువు వద్ద లేదా పాత బస్టాండు ప్రాంతంలో గాని తగిన స్థలాన్ని కేటాయించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని



కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెంట నరసింహ, జిల్లా నాయకులు కుక్కుడువు సోమయ్య, సాదు విజయకుమార్, గొరింకల శివశంకర్, కొలుపుల వివేక్, మాటూరి అశోక్, ఉడుత భాస్కర్, శాగంటి నరసింహ, బోయిని బాలయ్య, సామల ఆనంద్, భీమరి నరసింహ, కనక బాలరాజు, మొలకల సత్యనారాయణ, బర్ల పోచయ్య, పిట్టల రాములు, నీలం శ్రీరాములు, పోతరాజుల రవీందర్, పెంట వినయ్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి ముగ్గురు మహిళలకు విముక్తి

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, నవంబరు 7 : మహిళలను అక్రమ మార్గాల్లో వ్యభిచారంలోకి దింపుతూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని షీ టీమ్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ హెచ్చరించారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో వ్యభిచార గృహం నడుపుతున్నారనే పక్కా సమాచారంతో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం, షీ టీమ్స్ బృందాలు సంయుక్తంగా దాడులు నిర్వహించాయి. ఈ దాడిలో అక్రమ నిర్బంధంలో ఉన్న ముగ్గురు బాధిత మహిళలను రక్షించడంతో పాటు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ముగ్గురు నిందితులను పోలీసులు గుర్తించారు.ఘటనా స్థలం నుండి ఐదు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్ సహా మొత్తం ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మహిళలపై దోపిడీ, బలవంతపు వ్యభిచారం, అక్రమ రవాణా వంటి నేరాలకు పాల్పడే వారిపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంటుందని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఇన్స్పెక్టర్ స్పష్టం చేశారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కేసును త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడిలో ఏహెచ్‌టీయూ, షీ టీమ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యకాంతుల దీపావళి..
ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలి



మాజీ మంత్రి పువ్వాడ
ముద్ర ప్రతినిధి, ఖమ్మం,
నవంబరు 7 : చెడుపై మంచి సాధించిన విజయానికి, చీకటిపై వెలుగులు నింపిన ప్రాభవానికి ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కోరారు. ఈ దివ్యమైన పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులను నింపి, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, తన అభిమానులకు దీపావళి పండుగ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్



ముద్ర, దేవరకొండ:దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ బీల్యా నాయక్ .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు. దీపావళి అంటే దీపాల వరుస అని, దీపాలు చీకటిని తొలగించి వెలుగును ప్రసరింపజేసినట్లే, మన జీవితాల్లోని అజ్ఞాన అంధకారాన్ని తొలగించి జ్ఞానజ్యోతిని వెలిగిస్తాయని అన్నారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దీపానికి విశిష్టమైన స్థానం ఉందని, దీపం దైవస్వరూపంగా, జ్ఞానానికి, ఆనందానికి ప్రతీకగా భావిస్తారని పేర్కొన్నారు. మంచిపై చెడు సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని తెలిపారు.జీవితంలో వెలుగునీడలు సహజమని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన, మంచితనం, మానవతా విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చిన్న దీపం సైతం చిమ్మచీకటిని తొలగించగలదని, అదేవిధంగా ప్రతి ఒక్కరి జీవితంలో ఆశావహ దృక్పథం కొత్త వెలుగులు నింపుతుందని అన్నారు.ఈ దీపావళి పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా ఆనందోత్సాహాలు వెల్లివిరియాలని, ప్రజల కష్టాలు తొలగి అందరి జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని కేతావత్ బీల్యా నాయక్ కోరారు

కష్టాల్లో ఉన్న సహోద్యోగి అండగా..

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డుకు రూ.లక్ష ఆర్థిక సాయం
ఎస్పీ పిలుపుతో మానవత్వం చాటుకున్న జిల్లా పోలీసు సిబ్బంది
ముద్ర, సూర్యాపేట, నవంబరు 7:విధి నిర్వహణలోనే కాదు.. సహోద్యోగి కష్టాల్లోనూ తామంతా ఒక కుటుంబమని సూర్యాపేట జిల్లా పోలీసులు నిరూపించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా పోలీసు సిబ్బంది సమష్టిగా రూ.లక్ష సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు.చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. దీంతో ఆయనకు మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్‌లోని గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న జిల్లా పోలీసు సిబ్బంది సహాయం చేసేందుకు ముందుకొచ్చారు.సహోద్యోగుల కష్టసుఖాల్లో ఒక కుటుంబంలా అండగా నిలవాలని జిల్లా ఎస్పీ నరసింహ ఇచ్చిన పిలుపుతో పోలీసు సిబ్బంది స్పందించారు. తమ వంతు సహకారంగా సమకూర్చిన రూ.లక్ష నగదును చివ్వెంల ఎస్సై మహేశ్వర్ ద్వారా బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. సహోద్యోగి ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలవడం పోలీసు కుటుంబంలోని ఐక్యతకు, మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. బాలకృష్ణ త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 08.11.2026
www.mudranews.in | @mudranews

టపాసుల పొగకు దూరంగా ఉండండి

ఆస్తమా ఉన్నవారు బాణసంచా కాల్చే ప్రాంతాలకు వెళ్లకూడదు. పొగ, ధూళి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో గడపడం వల్ల శ్వాస సమస్యలు పెరిగే ప్రమాదం ఉంది.



బాలిస్టిక్ మిస్సైల్స్‌పై పరిమితిని ఎత్తేశాం..

ఇరాన్ కీలక ప్రకటన..!

ముద్ర, ఇరాన్: బాలిస్టిక్ క్షిపణుల పరిధిపై విధించుకున్న 2,000 కిలోమీటర్ల స్వీయ పరిమితిని ఎత్తివేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. దాంతో మరింత దూరంలోని లక్ష్యాలను ఛేదించగల క్షిపణులను అభివృద్ధి చేసేదిశగా ఇరాన్ అడుగులు వేసే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇజ్రాయెల్ , అమెరికాల దాడులకు హద్దుల్లేని ప్రతిదాడులు చేద్దామని ఇరాన్ సేనలకు సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఇరాన్ తాజా ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. క్షిపణుల పరిధికి సంబంధించిన పరిమితులు తొలగిపోయాయని, ఈ సామర్థ్యాలను తాము ఆచరణలో ప్రదర్శిస్తామని జనరల్ హొస్సేన్ మొహెబ్బి మీడియా సమావేశంలో వెల్లడించారు. కాగా, 2,000 కిలో మీటర్లకుపైగా దూరం వెళ్లగల బాలిస్టిక్ క్షిపణులు ఇరాన్ వద్ద ఉన్నట్లు అధికారిక సమాచారమేమీ లేదు. ఈ రెండు వేల కిలోమీటర్ల పరిధి కింద మొత్తం అరేబియా ద్వీపకల్పం తోపాటు ఈజిప్టులోని చాలావరకు భూభాగం, గ్రీస్, బాల్కన్‌లోని కొన్ని ప్రాంతాలు వస్తాయి. అయితే ఇరాన్ తన అంతరిక్ష కార్యక్రమానికి సంబంధించిన సాంకేతికతను ఖండాంతర బాలిస్టిక్ క్షిపణుల రూపకల్పనకు ఉపయోగించుకునే అవకాశాలు లేకపోలేదని అమెరికా చెబుతున్నది. యెమెన్ రాజధాని సనా సమీపంలోని అల్-షరియా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో 22 మంది మృతి



చెందారని హౌతీ తిరుగుబాటుదారుల ఆధ్వర్యంలోని ఆరోగ్యశాఖ ప్రకటించింది. మరో 30 మంది గాయపడ్డారని తెలిపింది. వారిలో చాలావరకు మహిళలు, చిన్నారులే ఉన్నారని పేర్కొన్నది. సౌదీ అరేబియానే ఈ దాడులకు పాల్పడిందని ఆరోపించింది. దక్షిణ యెమెన్‌లోని ఓ మార్కెట్‌పై జరిగిన దాడుల్లో 30 మంది ప్రాణాలు కోల్పోయారని హౌతీలు ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ దాడులు జరిగాయి.

బ్యాంకు పతనంతో నిరసనలు..

గృహ నిర్బంధంలో పరాగ్వే అధ్యక్షుడు

ముద్ర, అసున్సియోన్: దక్షిణ అమెరికా దేశమైన పరాగ్వేలోని అతి పెద్ద బ్యాంకు పతనమైంది. దీంతో ఆ దేశంలోని సగం మంది ప్రజలకు నిధులు అందుబాటులో లేకుండా పోయాయి. పరాగ్వేను ఆర్థిక, రాజకీయ సంక్షోభంలోకి ఇది నెట్టింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడిపై అభిశంసన చర్యలు చేపట్టడంతో పాటు గృహ నిర్బంధం చేశారు. గ్రూపో వాజ్క్వేజ్ వ్యాపార సముదాయం నియంత్రణలో ఉన్న డిజిటల్ రుణదాత అయిన యూనో బ్యాంక్ ఆర్థిక పరిస్థితి తీవ్రంగా క్షీణించినట్లు నియంత్రణ సంస్థలు గుర్తించాయి. నవంబర్ 3న పరాగ్వే సెంట్రల్ బ్యాంక్ ఈ బ్యాంక్‌ను తన నియంత్రణలోకి తీసుకున్నది. దీంతో 65 లక్షల జనాభా ఉన్న ఆ దేశంలో సుమారు 30 లక్షలకు పైగా బ్యాంకు వినియోగదారులు తమ పొదుపు డబ్బు పొందలేని



పరిస్థితి ఏర్పడింది.కాగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) మాజీ ఆర్థికవేత్త, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రుడైన పరాగ్వే అధ్యక్షుడు శాంటియాగో పెనా గతంలో ఈ బ్యాంక్ గ్రూప్‌లో వాటా కలిగి ఉన్నారు. దీంతో యూనో బ్యాంక్ విస్తరణకు ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్థిక సంక్షోభంతో పాటు అధ్యక్షుడిపై ఆ దేశవ్యాప్తంగా ప్రజల నిరసనలు మిన్నంటాయి.మరోవైపు ఈ సంక్షోభం నేపథ్యంలో నవంబర్ 5న అధ్యక్షుడు శాంటియాగో పెనా తన రాజీనామాను ప్రకటించారు. అయితే చట్టసభ సభ్యులు దీనికి అంగీకరించలేదు. అధికార దుర్వినియోగం ఆరోపణలపై నవంబర్ 7న అధ్యక్షుడిపై అభిశంసన తీర్మానాన్ని పరాగ్వే సెనేట్ ఆమోదించింది. దీంతో పెడ్రో అలియానా ఆయన వారసుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. అభిశంసన జరిగిన కొద్ది నిమిషాలకే పెనాను అదుపులోకి తీసుకుని గృహనిర్బంధంలో ఉంచారు.

అయోడిన్ టాబ్లెట్‌లు పంచుతున్న ఇరాన్



ముద్ర, ఇరాన్: ఇరాన్ సర్కారు ప్రజలకు అయోడిన్ టాబ్లెట్‌లు పంచుతున్నది. యుద్ధరంగంలో ఉన్న తమకు ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో తెలియక ముందుజాగ్రత్త చర్యకు పూనుకుంది. అయితే యుద్ధానికి, అయోడిన్ టాబ్లెట్లకు సంబంధం ఏమిటని మీరు అనుమానిస్తున్నారా..? కానీ ఆ రెండింటికీ సంబంధం ఉన్నది. ఆ సంబంధం ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.. యుద్ధంలో భాగంగా అమెరికా ఇప్పటికే ఇరాన్‌పై భీకర దాడులకు పాల్పడింది. ఈ క్రమంలోనే మళ్లీ దాడులు చేస్తామని సంకేతాలు కూడా ఇస్తున్నది. అమెరికా మళ్లీ దాడులు గనుక చేస్తే ఇరాన్ అణుకేంద్రాలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉంది. అణుకేంద్రాలపై డ్రోన్, మిస్సైల్ దాడులు జరిగినప్పుడు పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర రేడియేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నది. అయోడిన్ టాబ్లెట్‌లు యాంటీ రేడియేషన్ స్వభావాన్ని కలిగి ఉంటాయి. అందుకే అణుకేంద్రాలకు సమీపంలోని ప్రజలకు ముందు జాగ్రత్తగా ఇరాన్ అయోడిన్ టాబ్లెట్‌లు పంచుతున్నది. అణు కేంద్రాలకు సమీపంలోని ప్రజలకు ముందు జాగ్రత్తగా తాము అయోడిన్ టాబ్లెట్లను పంపిణీ చేస్తున్నామని, ట్రంప్‌ను నమ్మలేమని, ఆయన ఎప్పుడైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని ఇరాన్ అధికారి ఒకరు మీడియాతో అన్నారు. ఇటీవల అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో కూడా అణుస్థావరాల చుట్టూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రజలకు టెహ్రాన్ అయోడిన్ టాబ్లెట్‌లను పంచింది. రేడియేషన్ వల్ల థైరాయిడ్ కణాలు దెబ్బతింటాయి. దాంతో ఆ గ్రంథి పనితీరు మందగించి హార్మోన్లను సరిగా ఉత్పత్తి చేయదు.

అణు ప్రమాదాలవల్ల రేడియేషన్‌కు గురయ్యేవారు భవిష్యత్‌లో థైరాయిడ్ క్యాన్సర్ బారినపడే ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రెండురోజుల క్రితం జాతీయ భద్రతా బృందంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ అయ్యారు. ఇరాన్‌పై సైనికచర్య కొనసాగించాలా వద్దా..? అనే దానిపై చర్చించారు. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని పికాక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న అణుకేంద్రంపై దాడి జరగవచ్చునన్న భయాలు నెలకొన్నాయి. అమావాస్య కావడంతో రాబోయే రెండు రోజుల్లో చంద్రుడి కాంతి తక్కువగా ఉంటుందని, అది దాడులు చేయడానికి అనుకూలమైన సమయమని ఆందోళన వ్యక్తమవుతున్నది.

ఇదిలావుంటే ఇరాన్ అణు కార్యక్రమం గురించి సమాచారం ఇచ్చిన వారికి అమెరికా సైన్యం భారీ రివార్డు ప్రకటించింది. 20 మిలియన్ డాలర్లు ఇస్తామని వెల్లడించింది. అలాగే వారికి పునరావాసం కల్పిస్తామని చెబుతున్నది. ఇరాన్‌లోని అణుకేంద్రాలు, పరికరాలు, సిబ్బంది, శాస్త్రవేత్తల గురించి సమాచారం ఇచ్చిన వారికి 'రివార్డ్ ఫర్ జస్టిస్' ప్రోగ్రామ్ కింద ఈ ఆఫర్ ఇచ్చింది. మరోవైపు శుక్రవారం ఇరాన్‌పై పరిమిత స్థాయిలో అమెరికా దాడులు చేసింది. కొన్ని నిమిషాలపాటు ఆ దేశ వైమానిక రక్షణ వ్యవస్థలను టార్గెట్ చేశామని ట్రంప్ వెల్లడించారు.

చైనా స్పేస్‌స్టేషన్‌కు వెళ్లనున్న పాకిస్థానీ ఆస్ట్రోనాట్



ముద్ర, బీజింగ్: చైనా అంతరిక్ష కేంద్రానికి పాకిస్తానీ వ్యోమగామి వెళ్లనున్నారు. షెంజూ-24 వ్యోమనౌకలో ఆ ఆస్ట్రోనాట్ ప్రయాణిస్తారు. చైనీస్ స్పేస్ స్టేషన్‌కు వెళ్తున్న తొలి విదేశీ వ్యక్తిగా పాక్ ఆస్ట్రోనాట్ రికార్డు క్రియేట్ చేయనున్నారు. అంతరిక్ష కేంద్రంలో స్వల్ప వ్యవధి పాటు ఆ ఆస్ట్రోనాట్ గడపనున్నారు. షెంజూ-24 మిషన్‌కు చెందిన వివరాలను చైనా అంతరిక్ష సంస్థ వెల్లడించింది. అయితే వ్యోమనౌక ప్రయోగ తేదీని కానీ, లేక పాక్ వ్యోమగామి ఎవరన్నదానిపై చైనా ప్రకటన చేయలేదు. చైనా అంతరిక్ష చరిత్రలో తొలిసారి రెండు దేశాలు సంయుక్తంగా మిషన్ చేపట్టనున్నాయి. పాకిస్తానీ ఆస్ట్రోనాట్.. ఓ పేలోడ్ స్పెషలిస్టు తరహాలో ఆ జర్నీలో ఉంటారని చైనా మీడియా పేర్కొన్నది. ప్రస్తుతం చైనాలో ఇద్దరు పాకిస్తానీ వ్యక్తులు వ్యోమగాములుగా శిక్షణ పొందుతున్నారు. మొహమ్మద్ జీషాన్ అలీ, ఖుర్రం దౌద్.. చైనీస్ వ్యోమగాములతో శిక్షణ తీసుకుంటున్నారు. ఈ ఇద్దరిలో ఒకరు చైనా అంతరిక్ష కేంద్రానికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. 2025 ఫిబ్రవరిలో కుదిరిన అగ్రిమెంట్ ఆధారంగా ఈ మిషన్ చేపట్టనున్నారు. పాకిస్తాన్ కూడా ఇటీవల తన స్పేస్ ప్రోగ్రామ్ గురించి వెల్లడించింది. 2035 నాటికి చంద్రుడిపైకి వెళ్లామని మంత్రి అషాన్ ఇక్బాల్ తెలిపారు. పాకిస్తాన్ నిర్మిత లూనార్ రోవర్‌ను చైనాకు చెందిన చేంజ్-8 మిషన్ ద్వారా పంపనున్నారు. 2028లో ఈ ప్రయోగం జరిగే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు చైనా మాత్రం 2030 నాటికి చంద్రుడిపై వ్యోమగాములను దింపేందుకు ప్రయత్నిస్తోంది. ఇక 2035 నాటికి భారత్ తన స్వంత స్పేస్ స్టేషన్ నిర్మించే ప్రయత్నాలు కొనసాగిస్తోంది. చంద్రుడిపైకి 2040 నాటికి ఆస్ట్రోనాట్‌ను పంపేందుకు చూస్తోంది.

అవుసులపల్లిలో పోలీసుల కమ్యూనిటీ ప్రోగ్రాం

75 పత్రాలు లేని వాహనాలు స్వాధీనం





ముద్ర ప్రతినిధి, మెదక్: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం శనివారం తెల్లవారుజామున నిర్వహించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని 69 ద్విచక్ర వాహనాలు, 2 బొలెరోలు, 4 ఆటోలను కలిపి మొత్తం 75 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్ల మాయమాటలకు మోసపోవద్దని, ఓటీపీలు, బ్యాంకు వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల మరణాలకు హెల్మెట్ ధరించకపోవడం ప్రధాన కారణాల్లో ఒకటని తెలిపారు. చిన్న దూరమైనా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ స్ట్రాప్ బిగించుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మైనర్ బాలిక అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నప్పటికీ పోక్సో చట్టం ప్రకారం నేరమేనని స్పష్టం చేశారు. ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాలికల రక్షణ విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని, ఈ సేవలను అనవసరంగా దుర్వినియోగం చేయరాదని తెలిపారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ వ్యవస్థ విద్యాశాఖలో విలీనం చేయాలి

కలెక్టర్, ఎంఈఓలకు వినతిపత్రం



ముద్ర ప్రతినిధి మెదక్: రాష్ట్రంలోని 194 మోడల్ స్కూళ్లలో గత 13 సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు అనేక సర్వీస్, ఆర్థిక, సంక్షేమ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మోడల్ స్కూల్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ స్టీరింగ్ కమిటీ సభ్యులు బి. కొండయ్య, ఎస్. విఠల్ పేర్కొన్నారు.ఈ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్. విఠల్, రాజ్ గోపాల్, సాయిలు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టర్, డిఈఓ వినతిపత్రం అందజేశారు. మోడల్ స్కూళ్లను పాఠశాల విద్యాశాఖలో విలీనం చేసి ఉద్యోగుల వేతనాలను 010 హెడ్ ఆఫ్ అకౌంట్ ద్వారా చెల్లించాలని, టీజీటీలకు 2013 నుంచి నోషనల్ సర్వీస్ కల్పించాలని, సిపిఎస్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలు, మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని, ఉద్యోగులందరికీ ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలు చేయాలని కోరారు.అలాగే మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు కల్పించడంతో పాటు సిపిఎస్ డెత్ గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్, ఇతర టెర్మినల్ బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలని, 317 మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేసి పెండింగ్ ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.మోడల్ స్కూళ్లలో జూనియర్ లెక్చరర్ పోస్టులు మంజూరు చేసి అర్హులైన పీజీటీలకు ప్రమోషన్లు కల్పించాలని, ప్రిన్సిపాళ్లకు ఉన్నత స్థాయి ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని, అవసరమైన హిందీ పీజీటీ పోస్టులు మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రతి మోడల్ స్కూల్‌కు రెగ్యులర్ జూనియర్ అసిస్టెంట్ పోస్టు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు, సభ్యులు సుంకరి సాయిలు, ప్రేమ్ సాగర్, లింగం, రవికుమార్, మురళీధర్ రావు, పార్థసారధి రావు తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ మీట్‌లో మెరిసిన మెదక్ మహిళా కానిస్టేబుళ్లు

ఎస్పీ సన్మానం



ముద్ర ప్రతినిధి, మెదక్: వరంగల్‌లో నిర్వహించిన 5వ స్టేట్ మీట్ క్రీడా పోటీల్లో మెదక్ జిల్లాకు చెందిన ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లు సత్తాచాటారు. రాజస్థాన్ సిరిసిల్ల జోన్ జట్టు తరఫున హ్యాండ్‌బాల్, ఖోఖో పోటీల్లో పాల్గొని కాంస్య పతకాలు సాధించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శాలువాలతో ఘనంగా సన్మానించి, పతకాలు అందజేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 8.11.2026
www.mudranews.in | @mudranews

దీపావళి : మాస్క్ ధరించడం మర్చిపోవద్దు

బయటకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తే నాణ్యమైన మాస్క్ ధరించడం మంచిది. అయితే మాస్క్ పాగ నుంచి పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదని గుర్తుంచుకోవాలి. వీలైనంత వరకు కాలుష్య ప్రాంతాలకు దూరంగా ఉండాలి.



మహిళా కమిషన్ ఆగ్రహం


ముద్ర, హైదరాబాద్ : నిరుపేద మహిళల నుంచి అక్రమంగా అండాలు సేకరిస్తున్న వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆసుపత్రులు, ఐవీఎఫ్ సెంటర్లు, ల్యాబ్ లపై చర్యలు తీసుకోవడంలో జాప్యంపై మహిళా కమిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం ఏజెంట్లపైనే కేసులు నమోదు చేసి, ప్రధాన సూత్రధారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలను వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందిరా ఐవీఎఫ్, నర్మద, ఓయాసిస్, పద్మజ ఫర్టిలిటీ సెంటర్లు, సద్గురు ఏఆర్ టీ సెంటర్ తో పాటు డాక్టర్ హుస్సేన్ పై బాధితులు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణ చేపట్టకపోవడాన్ని తప్పుబట్టింది. తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద ఆదేశించారు. మహిళల గౌరవం, ఆరోగ్యంతో చెలగాటమాడే వారిపై చర్యల్లో జాప్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

రాహుల్ గాంధీని అడ్డుకుంటామనడం సిగ్గుచేటు

ముద్ర, హైదరాబాద్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు రాష్ట్రాన్ని ఇచ్చిన కుటుంబానికి చెందిన రాహుల్ గాంధీని అడ్డుకుంటామని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రాహుల్ గాంధీని అడ్డుకునే దమ్ము, ధైర్యం బీజేపీ నేతలకు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని, రాష్ట్రానికి కరువు సాయం కింద కోరిన రూ.20 వేల కోట్లు కూడా మంజూరు చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి ఒక్క ప్రాజెక్టు తీసుకురాని బీజేపీ నేతలను ప్రజలు నిలదీస్తారని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడాలని బీర్ల అయిలయ్య పిలుపునిచ్చారు.

ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు: చంద్రబాబు

ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నిండాలి.. ప్రతి కుటుంబంలో సుఖశాంతులు వెల్లివిరియాలి



ముద్ర, అమరావతి : రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దీపావళి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుని చెర నుంచి లోకానికి విముక్తి కలిగించి, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగను జరుపుకుంటామని పేర్కొన్నారు. ఈ దీపావళి ప్రతి ఇంటా ఆనందాల వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు చిగురించాలని అభిలషించారు. ప్రతి ఒక్కరూ వెలిగించే దీపం తమ ఇంటికే కాకుండా సమాజానికి కూడా వెలుగునివ్వాలని సీఎం ఆకాంక్షించారు. సాటి వారి జీవితాల్లో సంతోషాన్ని నింపడం కూడా పండుగలో భాగం కావాలని సూచించారు. మన పండుగలు అందించే సందేశాన్ని అర్థం చేసుకుని, పరస్పర సహకారం, ఐకమత్యంతో అందరూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దీపాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.

దీపావళి వెలుగులు ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలి

- సీఎం రేవంత్ రెడ్డి



ముద్ర, హైదరాబాద్ : దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలనలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందన్నారు. దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని ప్రజలంతా దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ కాంతులు ప్రతి ఇంటా సుఖసంతోషాలు నింపాలని, ప్రజల జీవితాలు ఆయురారోగ్యాలు, సిరిసంపదలు, శాంతిసౌభాగ్యాలతో వెల్లివిరియాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అదే సమయంలో పండుగ సంబరాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, కాలుష్యానికి తావులేకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు, పెద్దలు అందరూ సురక్షిత వాతావరణంలో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ప్రపంచ పెట్టుబడులకు విశాఖ వేదిక

59 దేశాల భాగస్వామ్యంతో సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్–2026..

ముద్ర, అమరావతి : ప్రపంచ పెట్టుబడులు, అంతర్జాతీయ వాణిజ్యం, సాంకేతిక భాగస్వామ్యాలకు ఆంధ్రప్రదేశ్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ నెల 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్–2026 నిర్వహించనున్నారు. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే ఇతివృత్తంతో జరిగే ఈ అంతర్జాతీయ సదస్సుకు 59 దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఇందులో 15 మంది విదేశీ మంత్రులు, 40 మందికి పైగా అంతర్జాతీయ వక్తలు, 350 మంది విదేశీ ప్రతినిధులతో పాటు మొత్తం 1,250 మంది పాల్గొననున్నారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రపంచ మార్కెట్లతో ఏపీ పరిశ్రమలను అనుసంధానించడమే సదస్సు ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) అంతర్జాతీయ వ్యాపార అవకాశాలు కల్పించడం, యువతకు ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలను పరిచయం చేయడం, సాంకేతిక సహకారాన్ని విస్తరించడంపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్లు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించాలని సీఎం ఆదేశించారు. అత్యుత్తమ విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, సమర్థ నాయకత్వం ఏపీకి బలమని, రాష్ట్రంలో పెట్టుబడులు సురక్షితమనే నమ్మకాన్ని ప్రపంచ పారిశ్రామికవేత్తల్లో కల్పించాలని పేర్కొన్నారు. ఈ సదస్సులో వాణిజ్యం–పెట్టుబడులు, ప్రపంచ ఆర్థిక సహకారం, వ్యవసాయం–ఆహార భద్రత, నైపుణ్యాలు–అంతర్జాతీయ ఉపాధి, సాంకేతికత–ఆవిష్కరణలు, స్వచ్ఛ ఇంధనం–సుస్థిర వృద్ధి వంటి ఆరు కీలక రంగాలపై చర్చలు జరగనున్నాయి. వ్యాపార సంస్థల మధ్య 400 బిజినెస్ టు బిజినెస్ సమావేశాలతో పాటు ప్రభుత్వాలు, పరిశ్రమల మధ్య ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు. సింగపూర్, కెనడా, యూఏఈ, ఈజిప్ట్ తదితర దేశాల ప్రతినిధులు, అంతర్జాతీయ సంస్థల ప్రముఖులు పాల్గొననున్నారు.

దీపావళి కానుకగా మరో 4.5 లక్షల మందికి చేయూత పింఛన్లు

కోడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం ప్రారంభం
కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి సీతక్క.. ఈ నెల నుంచే కొత్త లబ్ధిదారులకు పింఛన్లు

ముద్ర, హైదరాబాద్ : దీపావళి పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేయనుంది. ఈ మేరకు నూతన లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నవంబర్ 8న తన సొంత నియోజకవర్గమైన కోడంగల్‌లో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరుకానున్నారు.

వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులు తదితర వర్గాలకు చెందిన అర్హులకు కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నారు. కోడంగల్‌లో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కొంతమంది లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారుల చేతుల మీదుగా మిగతా అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు. కొత్తగా పింఛన్లు పొందనున్న వారందరికీ నవంబర్ నెల నుంచే పింఛను మొత్తాన్ని చెల్లించనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.



ఘనంగా తెలంగాణ జానపద కళాభవన్ ప్రారంభోత్సవం



ముద్ర, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళారూపాలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో రసకూటమి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ జానపద కళాభవన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సంప్రదాయ కళలను కాపాడుతూ వాటిని కొనసాగిస్తున్న కళాకారులను గుర్తించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారూపాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా గంగిరెద్దుల ఆట ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఒకప్పుడు గ్రామీణ జీవితంలో అంతర్భాగంగా ఉన్న జానపద కళలు ప్రస్తుతం ఆదరణ తగ్గడంతో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ కళలను కొనసాగిస్తున్న గంగిరెద్దుల కళాకారులకు ప్రత్యేక పురస్కారాలు అందజేసి వారి సేవలను కొనియాడారు.

కళాకారుల ప్రతిభను గుర్తించడం, వారి కళలకు ప్రోత్సాహం అందించడం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు, తెలంగాణ సన్మండలి సభ్యులు, వివిధ రంగాల ప్రముఖులు, జానపద కళాకారులు హాజరయ్యారు. కళలు బతికుంటేనే సంస్కృతి సజీవంగా ఉంటుందని, కళాకారులకు సమాజం తగిన గుర్తింపు, గౌరవం అందించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ధాన్యం నిల్వకు ఆధునిక సైలోల ఏర్పాటు!

***సాధ్యాసాధ్యాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక సమీక్ష**
***ఒక్కో సైలోలో లక్ష టన్నుల ధాన్యం నిల్వ చేసే ప్రతిపాదన**
***10 సైలో కేంద్రాల ద్వారా మొత్తం 10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం**

ముద్ర, హైదరాబాద్ : రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసేందుకు ఆధునిక సైలోల ఏర్పాటుపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ప్రతిపాదన సాధ్యాసాధ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ వ్యయం, నిర్వహణ విధానాలపై నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో నిపుణులు, పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి చర్చించారు.

***గోనె సంచుల అవసరం తగ్గింపు**

సైలోలు అనేవి పెద్ద మొత్తంలో ధాన్యాన్ని నేరుగా నిల్వ చేసేందుకు ఉపయోగించే ఆధునిక ఉక్కు గిడ్డంగులు. వీటి ద్వారా ధాన్యం నాణ్యతను కాపాడటంతో పాటు నిల్వ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చు. ధాన్యం నిల్వకు ముందే శుభ్రపరిచే, ఆరబెట్టే సదుపాయాలను కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సైలోల వినియోగం ద్వారా గోనె సంచుల అవసరాన్ని తగ్గించడంతో పాటు నిల్వ ఖర్చులను కూడా తగ్గించే అవకాశాలను సమావేశంలో పరిశీలించారు.



***10 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం లక్ష్యం**

ప్రతిపాదన ప్రకారం ఒక్కో సైలో కేంద్రంలో లక్ష టన్నుల ధాన్యం (10 లక్షల క్వింటాళ్లు) నిల్వ చేసే సామర్థ్యం కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10 సైలో కేంద్రాలను ఏర్పాటు చేస్తే మొత్తం 10 లక్షల టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసే అవకాశం ఉంటుంది. సైలోల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, నిర్వహణ పద్ధతులు, వ్యయ వివరాలపై సంబంధిత ఏజెన్సీల ప్రతినిధుల నుంచి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అదనపు డైరెక్టర్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లలో దీపావళి వెలుగులు.. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

లబ్ధిదారుల కుటుంబాలతో పండుగ సంబరాల్లో పాల్గొననున్న మంత్రి పొంగులేటి

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.శనివారం సచివాలయంలో హౌసింగ్ శాఖ అధికారులతో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వెల్లడించారు.

ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదని, పేద కుటుంబాలకు ఆత్మగౌరవం, భద్రత, భరోసా కల్పించే చిరునామా అని మంత్రి పేర్కొన్నారు. పేదల ఇళ్లలో ఆనందం నింపడంతోపాటు వారితో కలిసి పండుగ సంతోషాలను పంచుకోవాలనే ఉద్దేశంతో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.



ఇందులో భాగంగా ఆదివారం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మం రూరల్ మండలం కామంచికల్, నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం, కూసుమంచి మండలం పాలేరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి మంత్రి పొంగులేటి దీపావళి వేడుకల్లో పాల్గొననున్నారు. వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో పండుగ సంబరాలను పంచుకోనున్నారు.

అటవీ సంపద పరిరక్షణతో పాటు ఆదివాసీ గిరిజనుల జీవనోపాధికి ప్రాధాన్యం

ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అనుమతుల ప్రక్రియ వేగవంతం చేయాలి
ములుగులో అటవీ సంపదకు నష్టం కలగకుండా ఎకో టూరిజం అభివృద్ధి
అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్‌తో మంత్రి సీతక్క సమీక్ష

ముద్ర, ములుగు : ములుగు జిల్లాలోని అటవీ, ప్రకృతి సంపదను పరిరక్షిస్తూనే పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులకు సూచించారు. ఎకో టూరిజం ద్వారా స్థానిక ఆదివాసీ గిరిజనులకు జీవనోపాధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా పర్యాటక అభివృద్ధి చేపట్టాలని స్పష్టం చేశారు. అటవీ, పర్యావరణ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ములుగు జిల్లాకు వచ్చిన జయేష్ రంజన్ శనివారం జిల్లా కలెక్టరేట్‌లో మంత్రి సీతక్కతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో అటవీ పరిరక్షణ, ఎకో టూరిజం అభివృద్ధి, ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు, గిరిజనుల జీవనోపాధి తదితర అంశాలపై ఇరువురు చర్చించారు.

ములుగు జిల్లాకు ఉన్న ప్రత్యేక భౌగోళిక, ప్రకృతి వనరుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని సీతక్క సూచించారు. జిల్లాలోని దట్టమైన అడవులు, కొండలు, వాగులు, జలపాతాలు, సహజసిద్ధమైన ప్రకృతి ప్రాంతాలు పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉన్నాయని చెప్పారు. అయితే పర్యాటక అభివృద్ధి పేరుతో అటవీ సంపదకు నష్టం కలగకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు.



ప్రకృతిని పరిరక్షిస్తూనే పర్యాటకులను ఆకర్షించేలా ఎకో టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజలను, ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులను భాగస్వాములను చేయాలని సూచించారు. స్థానిక అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలు, ఆహార ఉత్పత్తులను పర్యాటక రంగంతో అనుసంధానిస్తే గిరిజనులకు స్థిరమైన ఆదాయ మార్గాలు ఏర్పడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో అనుమతుల జాప్యం తొలగించాలి

అటవీ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడంలో ఇబ్బందులు తలెత్తకూడదని మంత్రి అన్నారు. రహదారులు, తాగునీరు, విద్యుత్, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు తదితర అత్యవసర సదుపాయాల కల్పనకు చేపట్టే అభివృద్ధి పనులకు కేంద్ర అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియలో అనవసర జాప్యం లేకుండా చూడాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణతో పాటు అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేయాలని జయేష్ రంజన్‌ను కోరారు.

ములుగు జిల్లా ప్రకృతి సంపదను భవిష్యత్ తరాలకు కాపాడటంతో పాటు స్థానిక ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని సీతక్క తెలిపారు. ఈ దిశగా అటవీ, పర్యావరణ శాఖతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు.ఈ సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్, ఎస్పీ, డీఎఫ్ఓతో పాటు అటవీ, పర్యావరణ, జిల్లా పరిపాలనకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 8.11.2026
www.mudranews.in | @mudranews

టపాసులు : శ్వాసలో మార్పులను గమనించండి

టపాసుల పొగకు గురైన తర్వాత రాత్రిపూట దగ్గు పెరగడం, నిద్రలో శ్వాస ఇబ్బందులు, ఛాతీలో బిగుతు వంటి లక్షణాలను గమనించాలి. సమస్య కొనసాగితే వెంటనే వైద్యులను



సారా అర్జున్ ఫ్యాషన్ ట్రీట్!



సినీ ఇండ్రస్ట్రీ లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా అందరినీ ఆకట్టుకుని, ఇప్పుడు హీరోయిన్‌గా వరుస అవకాశాలతో దూసుకుపోతున్న సారా అర్జున్ ప్రస్తుతం మాల్దీవుల్లో వెకేషన్ ఎంజాయ్ చేస్తోంది. అక్కడ దిగిన కొన్ని లేటెస్ట్ ఫోటోలను ఆమె తన సోషల్ మీడియాలో షేర్ చేయగా, అవి నెట్టింట బాగా వైరల్ అవుతున్నాయి. సూర్యకాంతిలో మెరిసిపోతూ ఆమె ఇచ్చిన స్టైలిష్ పోజులు నెటిజన్లను ఆకట్టుకుంటున్నాయి. ఆ ట్రిప్ విశేషాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. మాల్దీవుల సముద్ర తీరంలో సారా అర్జున్ వేసుకున్న డ్రెస్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలం రంగుల బోల్డ్ అబ్‌స్ట్రాక్ట్ ప్రింట్స్ ఉన్న స్లీవ్‌లెస్ క్రాప్ టాప్, మ్యాచింగ్ స్కర్ట్‌లో ఆమె చాలా ట్రెండీగా కనిపించింది. సన్నని స్ట్రాప్స్, హై వేస్ట్ డిజైన్ ఈ లుక్‌ను మరింత లైట్‌గా మార్చేశాయి. ఇక గాలికి ఎగురుతున్న ఉంగరాల జుట్టు, సింపుల్ గోల్డ్ ఇయర్ రింగ్స్, చేతికి వేసుకున్న గాజులతో ఆమె లుక్ చాలా క్లాసీగా ఉంది.

తన కుటుంబంతో 'ది స్టాండర్డ్ మాల్దీవ్స్' రిసార్ట్‌లో ఈ బ్యూటీ ప్రశాంతమైన క్షణాలను గడుపుతోంది. నీలి సముద్రం తీరంలో, ఇండోర్ ప్లాంట్స్ మధ్యలో నిలబడి పక్కకు చూస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. ఇక "కొన్ని ప్రదేశాలు ప్రతి యాత్రను చాలా ప్రత్యేకంగా మారుస్తాయి" అంటూ ఆమె తన పోస్ట్‌కు క్యాప్షన్ ఇచ్చింది. ఈ పిక్స్ చూసిన ఫ్యాన్స్ "ఐలాండ్ ప్రిన్సెస్" అంటూ కామెంట్లు పెడుతున్నారు.

వెకేషన్‌తో పాటు సినిమాల పరంగా కూడా సారా అర్జున్ ఫుల్ బిజీగా ఉంది. రణ్‌వీర్ సింగ్ సరసన 'ధురంధర్ 2' చిత్రంలో యాలినా పాత్రలో నటించి ఆమె మంచి పేరు తెచ్చుకుంది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్ద విజయం సాధించింది. ఇక ప్రస్తుతం సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రాబోతున్న దిగ్గజ నటి మధుబాల బయోపిక్‌లో సారా టైటిల్ రోల్ పోషిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా రామ్ చరణ్ 'RC17' మూవీలోనూ ఆమె పేరు వినిపిస్తోంది. అయితే దీనిపై ఇంకా అధికారిక క్లారిటీ రావాల్సి ఉంది.

10 సినిమాల తాకిడి



టాలీవుడ్‌లో సినిమాల విడుదల విషయంలో అతివృష్టి, అనావృష్టి ధోరణి కొనసాగుతోంది. మంచి విడుదల తేదీలను వదులుకోవడం, పాన్ ఇండియా సినిమాలకు భయపడి వెనక్కి తగ్గడం, చివరకు చిన్న, మీడియం బడ్జెట్ చిత్రాలు ఒకేసారి బరిలోకి దిగడం పరిపాటిగా మారింది. నవంబర్ 12, 13 తేదీల్లోనూ ఇదే పరిస్థితి కనిపించనుంది.

ఈ రెండు రోజుల్లో శర్వానంద్ నటించిన 'భోగి', మౌళి హీరోగా మైత్రీ సంస్థ నిర్మించిన 'దొంగ నా కొడుకు', 'ఇట్లు అర్జున', సుడిగాలి సుధీర్ 'గోట్', రానా సమర్పణలో వస్తున్న 'డార్క్ చాకొలేట్' ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. వీటితో పాటు ఆహా, మాయలేడి, చంద్రయాన్, రోమియో జూలియట్, టాల్కమ్ పౌడర్ చిత్రాలు కూడా విడుదలకు సిద్ధమవుతున్నాయి.

ఒకేసారి ఇన్ని సినిమాలు విడుదల కావడం నిర్మాతలకు రిస్క్‌గా మారే అవకాశం ఉంది. ప్రేక్షకులు ఒకటి, రెండు సినిమాలకు మాత్రమే పరిమితమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పోటీ ప్రభావం బాక్సాఫీస్‌పై పడవచ్చు. మరోవైపు 'రామాయణ' రెండో వారంలోనూ థియేటర్లలో కొనసాగనున్న నేపథ్యంలో చిన్న, మీడియం బడ్జెట్ సినిమాలు ఎంతవరకు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయో చూడాలి.

కాబోయే భార్యతో సాయి దుర్గ తేజ్!



మెగా హీరో సాయి దుర్గ తేజ్ త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారు. నవంబర్ 5న హైదరాబాద్‌లోని హిల్టన్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో తన చిన్ననాటి ఫ్రెండ్ కిరణ్మయితో ఆయన ఎంగేజ్‌మెంట్ చాలా సింపుల్‌గా, అందంగా జరిగింది. మెగా, అల్లు ఫ్యామిలీ మెంబర్స్ అంతా కలిసి ఈ వేడుకలో సందడి చేశారు. అయితే ఎంగేజ్‌మెంట్ అయిన తర్వాత, తాజాగా తన కాబోయే భార్యతో దిగిన ఒక క్యూట్ ఫొటోను తేజ్ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. ఆ విశేషాలు ఏంటో చూద్దాం..ఈ ఎంగేజ్‌మెంట్ ఫొటోలో సాయి దుర్గ తేజ్, కిరణ్మయిల జంట చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంది. తేజ్ ఆల్-వైట్ షేర్వాణీలో చాలా క్లాసిక్‌గా, హ్యాండ్‌సమ్‌గా కనిపించారు. ఇక కాబోయే పెళ్లికూతురు కిరణ్మయి గ్రీన్ అండ్ గోల్డ్ పట్టు లంగా ఓణి, దానికి మ్యాచింగ్ గోల్డ్ జ్యువెలరీ వేసుకుని ట్రెడిషనల్ లుక్‌లో మెరిసిపోయారు. వీళ్లిద్దరి జంట సూపర్‌గా ఉందంటూ ఫ్యాన్స్ తెగ కామెంట్స్ పెడుతున్నారు.

హైదరాబాద్ జీనోమ్ వ్యాలీ రిసార్ట్‌లో కేవలం ఫ్యామిలీ మెంబర్స్, క్లోజ్ ఫ్రెండ్స్ మధ్య ఈ వేడుక జరిగింది. మెగాస్టార్ చిరంజీవి, రామ్ చరణ్, అల్లు అర్జున్, వరుణ్ తేజ్, అల్లు శిరీష్, వైష్ణవ్ తేజ్ ఇలా అందరూ వచ్చి కొత్త జంటను విష్ చేశారు. ఉంగరాలు మార్చుకున్న ఈ జంట, డిసెంబర్ 10, 2026న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా పెళ్లి చేసుకోబోతున్నారు.

ఇక 'పిల్లా నువ్వు లేని జీవితం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన తేజ్, 'సుప్రీమ్', 'చిత్రలహరి', 'విరూపాక్ష' లాంటి మంచి హిట్స్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన 'సంబరాల యేటి గట్టు' అనే సినిమా చేస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతుండగా, వచ్చే ఏడాది సంక్రాంతికి రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తన చిన్ననాటి ఫ్రెండ్‌తో కొత్త లైఫ్ మొదలుపెడుతున్న సాయి దుర్గ తేజ్‌కు ఫ్యాన్స్, సెలబ్రిటీలు విషెస్ చెప్తున్నారు. ఇక డిసెంబర్ 10న జరగబోయే వీళ్ల పెళ్లి వేడుక కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ హ్యాక్.. లీక్‌పై సురేఖా వాణి ఆగ్రహం!



టాలీవుడ్ నటి సురేఖా వాణి వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఆమె తీవ్రంగా స్పందించారు. తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా హ్యాక్ అయిందని తెలిపారు. తన వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను అనుమతి లేకుండా కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారని ఆమె వెల్లడించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో నోట్ పెట్టారు.మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తులు ఎవరైనా సరే.. తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఆ కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం తక్షణమే ఆపాలని నటి విజ్ఞప్తి చేశారు. ''ఈ కంటెంట్‌ను షేర్ చేస్తున్న ఖాతాలు, వ్యక్తులను గుర్తించి, ఆధారాలను సేకరిస్తాను. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాను'' అని హెచ్చరించారు. వ్యూస్, రీచ్, పబ్లిసిటీ కోసం.. ఈ పరిస్థితిని ఎవరూ తమకు అనుకూలంగా మార్చుకోవద్దని కోరారు. తన వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని, ఇది చాలా తీవ్రమైన అంశమని ఆమె పేర్కొన్నారు. 2005లో ఇండస్ట్రీకి వచ్చిన సురేఖా వాణి.. ఆ తర్వాత వరుసగా హిట్ సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. 'భద్ర', 'బొమ్మరిల్లు', 'ఏమాయ చేశావే', 'నాయక్', 'బాద్ షా' వంటి సినిమాలతో మెప్పించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews



ముంబై నుంచి హార్దిక్ అవుట్..

ముంబై ఇండియన్స్ సారధి హార్దిక్ పాండ్యా మరోసారి జాతీయ వార్తల్లో నిలిచాడు. సోషల్ మీడియాలో ట్రెండింగ్ టాపిక్ గా మారిపోయాడు. హార్దిక్ పాండ్యా ఇప్పుడు జాతీయ జట్టు తరపున ఆడటం లేదు. కెరియర్ కూడా అంత గొప్పగా లేదు. ప్రేయసిని పెళ్లి కూడా చేసుకోవడం లేదు. మరి హార్థిక్ పాండ్యా ఎందుకు వార్తలలో వ్యక్తిగా నిలిచాడు.. ఏం చేశాడు.. ఏం జరిగిందంటే..

ఐపీఎల్ లో ముంబై జట్టుకు సారధిగా కొనసాగుతు న్నాడు. హార్దిక్ పాండ్యా. ముంబై జట్టుకు రావడం కంటే ముందు అతడు గుజరాత్ జట్టుకు నాయకత్వం వహించాడు. గుజరాత్ జట్టు ఆడిన ఐపీఎల్ తొలి సీజన్లోనే విజేతగా నిలపాడు. ఆ తర్వాత సీజన్లో అతడు గుజరాత్ జట్టును రెండవ స్థానంలో నిలిపాడు.. అతడి నాయకత్వ పటిమను చూసిన ముంబై మేనేజ్మెంట్ గుజరాత్ నుంచి అతనిని కొనుగోలు చేసింది. అప్పటిదాకా నాయకుడిగా కొనసాగిన రోహిత్ శర్మను సాధారణ ఆటగాడి గానే పరిమితం చేసింది. ముంబై మేనేజ్మెంట్ తీసుకున్న నిర్ణయం వల్ల హార్దిక్ పాండ్యా సారధిగా మారిపోయాడు. కానీ అతని నాయకత్వంగా ముంబై జట్టు ట్రోఫీ కాదు కదా.. చెప్పుకునే స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయింది.

హార్దిక్ ఆట తీరు పట్ల ముంబై జట్టు మేనేజ్మెంట్ సానుకూల దృక్పథంతో లేదు. అందువల్లే వచ్చే సీజన్లో అతడిని పక్కనపెట్టి.. కొత్త సారధిని నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం ముంబై సారథి హార్దిక్ పాండ్యా వచ్చేసి సీజన్లో పంజాబ్ జట్టు తరపున ఆడతాడని తెలుస్తోంది. దీనికి సంబంధించి పంజాబ్.. ముంబై యాజమాన్యాలు ఒక అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది.

ఈ ఒప్పందంలో భాగంగా పంజాబ్ బౌలర్ అర్ష్ దీప్ సింగ్ ముంబై జట్టులోకి వెళ్తాడని తెలుస్తోంది. అయితే హార్దిక్ పాండ్యా ముంబై జట్టును వీడి పంజాబ్ జట్టుకు వెళ్తుండగా.. అర్ష్ దీప్ సింగ్ పంజాబ్ జట్టు నుంచి ముంబైకి వస్తున్నాడు. అయితే ఈ ఆటగాళ్ల మార్పిడికి సంబంధించిన అనుమతి భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇవ్వాల్సి ఉంది. బిసిసిఐ నిర్ణయం కోసం రెండు జట్లు ఎదురుచూస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఒప్పందంలో హార్దిక్.. అర్ష్ దీప్ సింగ్ కు సంబంధించిన ఆర్థిక ఒప్పందం ఎంత అనేది ఇంకా బయటికి తెలియ రాలేదు. ఎన్ని కోట్ల రూపాయలకు ఈ ఆటగాళ్ల మార్పిడి జరుగుతుందనే వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

చెమటోడ్చినెగ్గిన భారత్



న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌లోనూ భారత్‌కు అసలైన సవాల్ ఎదురైంది. ఈ పరీక్షలో టీమ్‌ఇండియా ఎట్టకేలకు పాసైపోయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కివీస్‌తో వెల్లింగ్టన్ వేదికగా జరిగిన రెండో వన్డేలో భారత్ డక్‌వర్త్ లూయిస్ (DLS) ప్రకారం నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా టాస్ ఆలస్యమైంది. దాదాపు గంట సమయం వృథా కావడంతో మ్యాచ్‌ను 47 ఓవర్లకు కుదించారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన కివీస్ 41 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. లక్ష్యం చిన్నదేనా అయినా బౌలర్లకు పిచ్ అనుకూలించడంతో భారత్ ఆరంభంలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా 26 ఓవర్లకు 7 వికెట్లు నష్టపోయి 113 పరుగులు చేసింది. డీఎల్ఎస్ ప్రకారం అప్పటికే నాలుగు పరుగులు ఎక్కువ చేసిన టీమ్ ఇండియాను విజేతగా ప్రకటించారు. రోహిత్ శర్మ (23; 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు అలరించాడు. శ్రేయస్ అయ్యర్ (30; 46 బంతుల్లో), కేఎల్ రాహుల్ (26★) రన్స్ చేశారు. నమన్ ధిర్ (12), కోహ్లీ (7), అక్షర్ పటేల్ (7) తక్కువ స్కోరుకే పెవిలియన్ బాటపట్టారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు.

తొలుత న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు. నాలుగో స్థానంలో వచ్చిన డారిల్ మిచెల్ (55; 104 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) హాఫ్ సెంచరీ చేశాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ (31; 38 బంతుల్లో) ఫర్వాలేదనిపించాడు. హెన్రీ నికోల్స్ (11) రన్స్ చేశాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. భారత బౌలర్లలో గుర్నూర్‌బ్రార్ (4/30) మరోసారి ఆకట్టుకున్నాడు. ఆకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. మూడో వన్డే మంగళవారం జరగనుంది.



Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555